విశాలాంధ్ర

ఏలూరు, పశ్చిమ గోదావరి
కాకినాడ, కోనసీమ
తూర్పుగోదావరి

మంగళవారం 16 సెప్టెంబరు 2025 8 పేజీలు

మచ్చపడితే మృత్యువే!

- గేదెలకు అంతుచిక్కని వ్యాధి
- 20 రోజుల్లో 30 గేదెలు మృతి
- అల్లాడుతున్న పాడి రైతులు
- పట్టించుకోని అధికారులు

మృత్యువుకు చేరువవుతున్న గేదెను పరిశీలిస్తున్న పశువైద్య అధికారులు

విశాలాంధ్ర - తాళ్లపూడి : మూగజీవాలు అంతు చిక్కని వ్యాధితో మృత్యువాతపడుతున్నాయి. అవి ప్రశ్నించలేవు అనేమో అధికారులు కూడా మిన్నకుంటున్నారు. వివరాల్లోకి వెళితే తాళ్లపూడి మండలంలో గేదెలు అర్ధాంతరంగా చనిపోతున్నాయి. అవి ఎందుకు చనిపోతున్నాయో పశు సంవర్ధకశాఖ పట్టించుకోవడం లేదు. దీంతో గేదెలే జీవనాధారంగా ఉన్న రైతాంగం అల్లాడిపోతోంది. మండలంలో గత 20 రోజులుగా పాడి రైతాంగాన్ని పట్టిపీడిస్తున్న వరుస గేదెల మరణాల సంఘటన పట్ల ప్రభుత్వానికి గాని, ప్రతిపక్షానికి గాని పట్టడం లేదు. గడచిన 20 రోజుల్లో ఒక్క పెద్దేవం గ్రామంలో 30 గేదెల వరకు అంతుచిక్కని వ్యాధి సోకి మృతి చెందాయి. ఒక్క గేదె లక్ష రూపాయల నుండి రెండు లక్షల రూపాయల వరకు ఖరీదు చేసేవి గా ఉన్నప్పటికీ, వ్యాధి సోకిందంటే చాలు చనిపోవడం ఖాయమనే భయాన్ని రైతులు ఎదుర్కొంటున్నారు. అంతా బీద, బిక్కి రైతులు, వారు పెంచే గేదెలు కానీ ఆవులు కానీ తమ కుటుంబంలో ఓ మనిషిగా చూసుకునే ఈ రైతాంగానికి గ్రామంలో నెలకొన్న ఈ పరిస్థితులతో కుదేలవుతున్నారు. దీన్ని పట్టించుకునేవారు ▶మిగతా 2లో..

ధాన్యం కొనుగోలుకు సన్నద్ధం కావాలి

జాయింట్ కలెక్టర్ టి. నిశాంతి

విశాలాంధ్ర - అమలాపురం : ఖరీఫ్ సీజన్లో ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా నిర్వహించేందుకు సర్వ సన్నద్ధం కావాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి. నిశాంతి లైన్ డిపార్ట్మెంట్ అధికారులు ఆదేశించారు. సోమవారం సివిల్ సప్లయిస్ కార్పోరేషన్ డియం డిఎస్ఓ, వ్యవసాయ, రెవెన్యూ, సహకార, మార్కెటింగ్, తూనికలు కొలతల అధికారులతో ఖరీఫ్ ధాన్యం సేకరణ సన్నద్ధతపై ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో 1,56,505 ఎకరాలలో వరి సాగు జరిగిందన్నారు. సుమారుగా 4,34,000 మెట్రిక్ టన్నుల దిగుబడి రానున్నదని వీటిలో వినియోగానికి 43,390 మెట్రిక్ టన్నులు పోను ▶మిగతా 2లో..

సెక్యూరిటీ గార్డ్స్ సమస్యల పరిష్కారానికి

దశలవారీ ఆందోళనలు

విశాలాంధ్ర - కాకినాడ : కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రిలో సెక్యూరిటీ గార్డుల సమస్యలు పరిష్కరించాలని ఏపీ మెడికల్ ఎంప్లాయిస్ కాంట్రాక్ట్ అండ్ సెక్యూరిటీ గార్డ్స్ వర్కర్స్ (ఏఐటియుసి అనుబంధం) అధ్యక్షులు కేవీ రామయ్య అధ్యక్షతన సోమవారం సెక్యూరిటీ గార్డ్స్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. సెక్యూరిటీ గార్డ్స్ జీతాలు పెంచాలని, సిఎల్ అమలు చేయాలని, మహిళల పట్ల సూపర్వైజర్ల ▶మిగతా 2లో..

కార్మికులకు ప్రోత్సాహం కరువు

విశాలాంధ్ర-కొయ్యలగూడెం : ఉద్యోగులు, ఉత్పత్తి రంగాల కార్మికులు, కర్షకులతోనే సంపద సృష్టి జరుగుతుందని అలాంటి సంపద సృష్టికర్తలకు పాలకుల నుంచి సరైన ప్రోత్సాహం అందడం లేదని సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య పేర్కొన్నారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డు వద్ద ఏఐటియుసి కార్మికుల సమావేశం మట్టా రామకృష్ణ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న కృష్ణ చైతన్య మాట్లాడుతూ ప్రభుత్వాలు మారుతున్నా మనుషులు మారుతున్నారే తప్ప విధానాలు మారడం లేదన్నారు. కేంద్రంలో ప్రధాని మోడీ అదాని, అంబాని,ఆస్తులు పెంచడానికి కార్పొరేట్ విధానం తీసుకొచ్చి విద్య,వైద్య రంగాల సేవలను ప్రజలకు దూరం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలలో అంతరాలు పెరిగి పేదరికంలోకి నెట్టివేయబడుతున్నారని తెలిపారు. మోడీ ప్రభుత్వం మాత్రం సంపద సృష్టికర్తలు అదాని, అంబాని అని గొప్పలు చెబుతూ వారి ఆస్తులు పెంచడానికి పనిచేస్తున్నారని ఎద్దేవా చేశారు. కార్మిక చట్టాలు సవరించి మరింత

దోపిడీకి గురి చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో పి4 విధానం అంటూ దత్తత తీసుకుంటామంటూ మాటలలో చెప్పడం తప్ప చేతలలో ఏమీ లేదన్నారు. ఉచితంగా అందాల్సిన సేవలను ప్రైవేటీకరిస్తే పేదరికం ఎలా తగ్గుతుందని ప్రశ్నించారు. కేంద్రంలో మోడీ అనుసరిస్తున్న విధానాలను తూచా తప్పకుండా చంద్రబాబు, పవన్ పాటిస్తున్నారని అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే అజెండాగా భవిష్యత్ పోరాటాలు నిర్వహిస్తామని తెలిపారు.

ఏఐటీయూసీ ఏలూరు జిల్లా అధ్యక్షులు రెడ్డి శ్రీనివాస్ డాంగే మాట్లాడుతూ ▶మిగతా 2లో..

డిగ్రీలో పొలిటికల్ సైన్స్ కొనసాగించండి

ఏఐఎస్ఎఫ్ డిమాండ్

విశాలాంధ్ర-ఏలూరు: స్థానిక కోటదిబ్బ ప్రభుత్వ డిగ్రీ కళాశాల బీఏ విద్యార్థులకు పొలిటికల్ సైన్స్ మేజర్ సబ్జెక్టు యథావిధిగా కొనసాగించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు డి.శివకుమార్, కోశాధికారి ఎం.క్రాంతి కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ఏఐఎస్ఎఫ్ విద్యార్థులతో కలిసి నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా శివకుమార్, క్రాంతి కుమార్ మాట్లాడుతూ కోటదిబ్బ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బి.ఎ. మొదటి సంవత్సరంలో 2025 - 26 విద్యా సంవత్సరం ప్రవేశం పొందిన విద్యార్థులకు పొలిటికల్ సైన్స్ మేజర్ సబ్జెక్టు లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. డిగ్రీ కళాశాలలో ప్రవేశాల సందర్భంగా అన్ని సబ్జెక్టులు ఉన్నాయని తెలిపారని, ఈ కారణంతో విద్యార్థులు బిఏలో

చేరారని, ప్రధాన సబ్జెక్టు పొలిటికల్ సైన్స్ లేకపోతే బీఏ అనే పదానికి అర్థం లేకుండా పోతుందన్నారు. ప్రిన్సిపాల్‌ను వివరణ కోరగా విద్యార్థులు లేని కారణంగా సబ్జెక్టు రద్దు చేశామని చెప్పటం హాస్యాస్పదంగా ఉందన్నారు. పేద విద్యార్థులకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, ప్రభుత్వ యంత్రాంగం పునరాలోచించి డిగ్రీలో బిఏ పొలిటికల్ సైన్స్ సబ్జెక్టు యథావిధిగా ▶మిగతా 2లో..

సమస్యల్లో చక్రద్వారబంధం

వెలగని విద్యుత్ దీపాలు

విశాలాంధ్ర - రాజానగరం : ఒక పక్క మంచినీటి సమస్య మరోపక్క రాత్రులు వీధి దీపాలు సక్రమంగా వెలగకపోవడంతో తమ గ్రామం సమస్యల వలయంలో చిక్కుకుందంటూ గ్రామస్థులు మొరపెట్టుకున్న సంఘటన మండలంలోని చక్రద్వారబంధంలో చోటుచేసుకుంది. దీనికి సంబంధించి వివరాలు ఈ విధంగా ఉన్నాయి. చక్రద్వారబంధం గ్రామంలో పంచాయతీ కార్యదర్శి సత్యవాణి ఆదేశాల మేరకు గడిచిన ఆర్థిక సంవత్సరంలో సుమారు రూ. 39 లక్షలు మేరకు ఇంటి పన్నులు నిమిత్తం గ్రామస్తులు నుండి వసూలు చేయగా వాటిలో ప్రస్తుతం రూ. 11.90 లక్షలు మాత్రమే ఉన్నాయని తెలుస్తుంది. వసూలు చేసిన సొమ్ముతో గ్రామంలో ఏ ఒక్క

అభివృద్ధి పనులు చేపట్ట లేదని,కేవలం ఒక్కసారి మాత్రం దోమల మందు పిచికారి(స్ప్రే) చేశారని పలువురు గ్రామస్తులు పేర్కొంటున్నారు. తమ గ్రామంలో పలు వీధుల్లో రాత్రుళ్లు వీధి దీపాలు సక్రమంగా వెలగడం లేదని,దీంతో అంధకారంలో గ్రామం ఉంటున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. పంచాయతీ సిబ్బందికి విన్నవించినా ఫలితం ▶మిగతా 4లో..

పశువులకు టీకాలు వేయించాలి

విశాలాంధ్ర-కొయ్యలగూడెం : పశువులను పెంచే రైతులంతా పశువులకు గాలికుంటు నివారణ వ్యాక్సిన్ లను తప్పనిసరిగా వేయించాలని టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ కమిటీ కార్యదర్శి గంగిరెడ్ల మేఘలాదేవి తెలిపారు. మండల కేంద్రమైన కొయ్యలగూడెం

పట్టణంలో పశు వైద్యశాల ఆవరణ వద్ద గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని ఎంపీపీ గంజిమల రామా రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పశు పోషకులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ పశువులకు ఉచితంగా టీకాలు వేయించుకోవాలని సూచించారు. పశుసంవర్ధక శాఖ వైద్యులు బి ఆర్ శ్రీనివాసన్ మాట్లాడుతూ నెల రోజుల పాటు గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాలు జరుగుతాయని ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ జనసేన పార్టీ అధ్యక్షుడు మాదేపల్లి శ్రీనివాస్, మండల బిజెపి అధ్యక్షుడు గోలిశెట్టి వాసు, వార్డ్ మెంబర్ పులపల్లి రవికుమార్, రైతులు, పశుసంవర్ధక శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా శ్రేయస్సుకు కూటమి ప్రభుత్వం కృషి

విశాలాంధ్ర-కొయ్యలగూడెం : ప్రజా శ్రేయస్సు కోసమే కూటమి ప్రభుత్వం పరిపాలన కొనసాగిస్తుందని జనసేన పార్టీ మండల అధ్యక్షుడు తోట రవి తెలిపారు. ఎగువ ప్రాంతాల నుండి వర్షపు నీరు అధికంగా రావడంతో

మండలంలో బోడిగూడెం గ్రామ పంచాయతీ పరిధి అంకాల గూడెం గ్రామ ఎస్సీ కాలనీకి నీరు చేరుకోవడంతో ఎస్సీ కాలనీ లో ఉన్న ఎస్సీల ఇళ్లు జలమయమయ్యాయి. నీరు వెళ్లే మార్గం లేనందున, విషయం తెలుసుకున్న జనసేన ,టిడిపి, పార్టీల నాయకులు అంకాల గూడెం ఎస్సీ కాలనీలోకి వెళ్లి జెసిబి సహాయంతో పూడుకుపోయిన కాలువలో తూడును తొలగించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ భారీ వర్షాల కారణంగా ఎగువ ప్రాంతాల నుండి వర్షపు నీరు చెరువులలో చేరి కాలువల ద్వారా అధికంగా ఇళ్లల్లోకి వస్తున్నందున ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికై అధికారులు పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ జనసేన పార్టీ అధ్యక్షుడు జక్కు శ్రీనివాస్, కొయ్యలగూడెం పట్టణ అధ్యక్షుడు మాదేపల్లి శ్రీనివాస్, ఏపూరి సతీష్, కంకిపాటి వంశీ, కూటమి పార్టీల నాయకులు పాల్గొన్నారు.

సన్నద్ధం కావాలి (1వ పేజీ తరువాయి)

మిగిలిన 3,88,000 మెట్రిక్ టన్నులు ప్రభుత్వ పరంగా కొనుగోలు చేయాల్సిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గత ఖరీఫ్ సీజన్ కంటే 1,30,000 మెట్రిక్ టన్నులు అదనపు లక్ష్యాన్ని సేకరణ కొరకు నిర్దేశించిందన్నారు. ఆరుగాలం శ్రమించి రైతులు పండించిన ధాన్యానికి మద్దతు ధర కల్పించేందుకు గత యేడాది ఖరీఫ్ సీజను సేకరణలో మాదిరిగా, రైతుల నుండి కొనుగోలు చేసిన ధాన్యానికి 48 గంటలలోపే చెల్లింపులు జరుగుతాయన్నారు. నవంబరు మొదటి వారంలో మండపేట, ఆలమూరు మండలాలలో ధాన్యం సేకరణ ఆరంభమ వుతుందన్నారు. జిల్లాలో 221 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఉన్నాయని వీటికి అనుబంధంగా 141 రైస్ మిల్లులు మ్యాపింగ్ చేశామన్నారు. గోనె సంచులు లేబరు, రవాణా సదుపాయాలు కల్పించడంతోపాటుగా రైతు సేవ కేంద్రాలలో సహకార అధికారి సిబ్బందిని నియమించి శిక్షణలను పూర్తి చేయాలన్నారు.

కేంద్ర ప్రభుత్వం వరి సాధారణ రకాలకు 2,369 రూపాయలు, ఏ గ్రేడ్ రకాలకు 2,389 రూపాయలకు పెంచి మద్దతు ధరలను ప్రకటించిందన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ మాధవి, ఆర్డీవోలు పి. శేఖర్, డి. అఖిల, ఆర్టీవో శ్రీనివాసరావు, డీఎస్ఓ ఉదయభాస్కర్, డీసీఎంఎస్ పి. శ్రీనివాస్, డిసిఓ రాధాకృష్ణ, డిపిఓ బోసు బాబు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగించండి

(1వ పేజీ తరువాయి)

ఉండేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని, లేనిపక్షంలో భవిష్యత్తులో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. అనంతరం జాయింట్ కలెక్టర్ పి.ధాత్రి రెడ్డిని కలిసి సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు సిద్దు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రోత్సాహం (1వ పేజీ తరువాయి)

మోడీ ప్రభుత్వం రాజ్యాంగ సంస్థలపై దాడి చేస్తున్నదన్నారు. ఫెడరల్ వ్యవస్థకు తూట్లు పొడుస్తుందని విమర్శించారు. బిజెపి ఆర్ఎస్ఎస్ పౌరుల హక్కులను కాలరాస్తూ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని మారుస్తూ కుట్ర పన్నుతున్నాయని విమర్శించారు. ఎన్నో పోరాటాల ద్వారా సాధించుకున్న 44 కార్మిక చట్టాలను 4 లేబర్ కోడ్‌లుగా విభజించి కార్మిక వర్గానికి బీజేపీ ప్రభుత్వం తీరని ద్రోహం తలపెట్టిందని పేర్కొన్నారు. కార్మిక హక్కుల పరిరక్షణ కోసం భవిష్యత్తులో మరిన్ని పోరాటాలు చేస్తామని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను హెచ్చరించారు. ఈ సమావేశంలో సీపీఐ మండల కార్యదర్శి తాడిగడప ఆంజనేయరాజు, సహాయ కార్యదర్శి లక్క లక్ష్మణరావు, వెలగల నాని, పులపాకుల దుర్గారావు, బొబ్బర చిట్టిబాబు, వెలగల రామారావు, రాంబాబు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆందోళనలు (1వ పేజీ తరువాయి)

వైఖరిని ఖండించాలని నినాదాలు చేశారు. ముఖ్య అతిథిగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్ మాట్లాడుతూ సెక్యూరిటీ గార్డ్స్‌కు జీవో ప్రకారంగా జీతాలు మంజూరు చేయాలని, సివిల్ అమలు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, అదనపు డ్యూటీల బకాయి వేతనాలు తక్షణమే చెల్లించాలని, అనారోగ్యానికి గురైన సెక్యూరిటీ గార్డ్స్‌కు సెలవులతో కూడిన జీతం మంజూరు చేయాలన్నారు.

సీనియర్ సెక్యూరిటీ గార్డ్‌లకు సూపర్వైజర్‌గా పదోన్నతులు కల్పించాలని, నెలవారి జీతం పదో తేదీలోపు చెల్లించాలని, మహిళల పట్ల సూపర్వైజర్ మొండి వైఖరి విడనాడాలని, మహిళలను గౌరవించని సూపర్వైజర్లపై చర్యలు తీసుకోవాలని, రోస్టర్ విధానాన్ని రద్దుచేసి పాత విధానాన్ని అమలు చేయాలని, పిఎఫ్ ఖాతా ప్రతినెల తెలియజేయుటకు కంప్యూటర్ ఆపరేటర్ని నియమించాలని, సెక్యూరిటీ గార్డ్ యూనిఫాం కుట్టు కూలి తక్షణమే మంజూరు చేయాలని, సెక్యూరిటీ గార్డ్స్ సమస్యలను సెప్టెంబర్ 20 తేదీ లోపు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేదంటే 21వ తేదీ నుండి 25వ తేదీ వరకు దఫదఫాలుగా ఆందోళన ఉంటుందని, 29వ తేదీన జిల్లా కలెక్టరేట్ కార్యాలయం వద్ద నిరసన తెలియజేస్తామని అన్నారు.

అనంతరం సెక్యూరిటీ గార్డ్స్ కాంట్రాక్ట్‌కి, ఆసుపత్రి సూపరింటెండెంటుకు వినతిపత్రం అందజేశామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్.అనిల్ కుమార్, దేగల మధు, మండపల్లి రాజేంద్రరావు, కాటూరి రాజు, రమణమ్మ, లోవ అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

మృత్యువే (1వ పేజీ తరువాయి)

కానరావడం లేదు.

కలుషితమైన ఆహారం, నీరు కారణం

పెద్దేవం గ్రామంలో నెల కొన్న వరుస గేదెల మరణాల పట్ల పశు వైద్యాధికారులు కలుషితమైన ఆహారం, నీరు కారణంగా చెబుతున్నారు. గ్రామం భౌగోళికంగా రోడ్డుకు అవతల, ఇవతల విస్తరించి వుంటుంది. ఒకవైపు భాగంలో గల కలుషిత చెరువు నీటి వల్ల, పిచ్చి మొక్కలు వల్ల గేదెలు అనారోగ్యం పాలవుతున్నాయని, లివర్, కిడ్నీ పాడై చనిపోతున్నాయని వైద్యులు చెబుతున్నారు. గ్రామంలో రైతాంగం కూడా చెరువు వైపున్న ప్రాంతాల్లోని గేదెలు మాత్రమే వ్యాధి బారిన పడుతున్నాయంటున్నారు.

వ్యాధి తీరు భయంకరం

పెద్దేవంలో గేదెలు ఎదుర్కొంటున్న వ్యాధి భయంకరంగా ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గేదెకు ఎడమ చెవి, మెడ భాగం మధ్య చిన్న తెలుపు, ఎరుపు రంగు మచ్చ ఏర్పడుతుంది. ఇది వ్యాధి ప్రథమ లక్షణం. ఒకటి రెండు రోజుల్లో తిండి తినదు, చురుకు తనం పోతుంది, కదలదు, నడవదు, నీరసపడి పడుకునే ఉంటుంది. మచ్చ చూసినప్పుడే రైతు గేదె మనకు దక్కదన్న నిర్ణయానికి వస్తున్నారు. అమరావతి నుండి పశువైద్యశాఖ డి.డి స్థాయి అధికారులు వచ్చినా వ్యాధిని గుర్తించకపోవ టం మిస్టరీగా ఉంది. రాష్ట్రంలో మరెక్కడా ఈ పరిస్థితి లేదు అని వెల్లడించారు. దీనికి మందులు వాడటమే తప్ప వేరే దారి లేదని తేల్చి వెళ్లారు. గ్రామం లో గేదెలు వ్యాధి బారిన పడ్డ సంఘటన జరిగిన తరువాత జమ్ముల శ్రీనివాస్ అనే రైతు తన గేదెలు మరణించిన సమయం నుండి అధికారులు స్పందించి రక్త పరీక్షలు, త్రాగే నీరు, ఆహారం పరీక్షలకు పంపారు. నీటి పరీక్ష ఫలితాలు నేటికి రాలేదు. ఇప్పటికి ఒక్క గేదె కు కూడా పోస్టుమార్టం చేయించ లేదు.

ఇంత నిర్లక్ష్యమా

ఒకే ప్రాంతం లో ఇన్ని పశువులు (గేదెలు) చనిపోతుంటే అధికారుల్లో చలనం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటువంటి సంఘటనలు అధిక స్థాయిలో జరిగినప్పుడు ఓ క్యాంపు ఏర్పాటు, లేకుంటే వైద్యాధికారులు ప్రత్యేక పర్యవేక్షణ, ఉచిత మందులు ఇవ్వటం వంటివి ఉంటాయి. కానీ పెద్దేవంలో సంఘటన పట్ల సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు.

సుగంది చెరువు కలుషితం

గేదెల మరణానికి కలుషిత నీరు కారణం అంటూ అధికారులు చెబుతున్న కలుషిత నీరు గ్రామంలోని సుగంది చెరువులోవి. నిజానికి ఈ చెరువు గత కొంత కాలం గా కలుషితమైంది. ఒకప్పుడు దీనిలో నీరు వాడుకునే వారు. కానీ ఇప్పుడు ఆ చెరువులో ఉన్న బుడగ తామర తొలగించేందుకు విపరీతంగా కలుపు మందు కొట్టారు. గత సంక్రాంతి సమయంలో ఊళ్ళో వైరస్ వచ్చి చని పోయిన కోళ్ల వ్యర్థాలు, కోళ్ళు అన్ని చెరువులో కలిశాయని, రెండు దఫాలు పశువులు చెరువులో దిగి చనిపోయిన సంఘట నలున్నాయని, చెరువు నిండా జలగలు ఉన్నా యని, కలుషితం అంటూ మాటలు చెప్పటం కాక చెరువు విషయం ఎటువంటి హెచ్చరికలు జాగ్రత్తలు పాటించటం లేదని గ్రామస్థులు తెలుపు తున్నారు. డిడి వంటి అధికారులు వచ్చి వెళ్ళాక కూడా రెండు రోజులుగా మరో ఐదు గేదెలు వ్యాధి బారిన పడ్డాయి. దీనిలో కొన్ని చనిపోయే స్థితికి వచ్చాయి. దీంతో ఎప్పుడు ఏ రైతు ఈ దురదృష్టకర వార్త వినాల్సి వస్తుందన్న భయంతో పాడి రైతులున్నారు.

గ్రామాలలో ప్రభుత్వ భూముల గుర్తింపు

విశాలాంధ్ర-లింగపాలెం: రీసర్వేలో భాగంగా ప్రభుత్వ భూములను గుర్తించే ప్రక్రియను లింగపాలెం మండలంలో చేపట్టారు. మండలంలో ఇప్పటికి ఏడు రెవెన్యూ గ్రామాలలో రీసర్వే పూర్తి చేశారు. జరగబోయే రీసర్వేలో భాగంగా ప్రభుత్వ భూములను గుర్తించే ప్రక్రియను చేపట్టారు. తహసీల్దార్ నజీముల్లాషా, రీసర్వే డిప్యూటీ తహసీల్దార్

నాగబాబు తమ సిబ్బందితో ప్రభుత్వ భూములను గుర్తించే పనులను చేస్తున్నారు. మొదట విడతలో పాచ్చానగరం, బాదరాల, రంగాపురం, ములగలం పాడులో ప్రభుత్వ భూములను గుర్తించినట్లు అధికారులు తెలిపారు. ఈ గ్రామాలలో 583 ఎకరాలు ప్రభుత్వ భూములు ఉన్నట్లు గుర్తించారు. రెండో విడతలో ముడిచెర్ల, వేములపల్లి, అయ్యప రాజుగూడెం, కలరాయన గూడెంలో ప్రభుత్వ భూములను గుర్తించారు. ఈ గ్రామాలలో 700 ఎకరాలు ప్రభుత్వ భూములు ఉన్నట్లు నిర్ధారించారు. గుర్తించిన భూములకు హద్దులు నిర్ణయించారు. మండలంలో మరో రెండు విడతల్లో మిగిలిన గ్రామాలలో ప్రభుత్వ భూములను గుర్తిస్తామని తహసీల్దార్ తెలిపారు. ఈప్రక్రియ పూర్తవ్వగానే ప్రైవేటు భూములలో సర్వే నిర్వహిస్తామని అన్నారు. ప్రభుత్వ భూములు గుర్తించటం వల్ల చెరువులు,కాలువలు, రహదారులు,ఇతర చోట్ల ప్రభుత్వ భూములలో ఉన్న ఆక్రమణలను తొలగించ వచ్చని, ఇవి ఆక్రమణల బారిన పడకుండా కాపాడుకోవచ్చని అధికారులు తెలిపారు. ప్రభుత్వ భూముల ఆక్రమణల వల్ల అనేక సమస్యలు తలెత్తుతున్నాయని భవిష్యత్తులో ఇటువంటి పరిస్థితులు లేకుండా జరుగుతుందని అన్నారు.

పశువుల ఆరోగ్యాన్ని కాపాడాలి

విశాలాంధ్ర-లింగపాలెం: పశువులకు వ్యాధులు సోకకుండా రైతులు జాగ్రత్తలు తీసుకొని పశు సంపదను కాపాడాలని పశు వైద్యాధికారులు తెలిపారు. జాతీయ పశువ్యాధి నియంత్రణలో భాగంగా లింగపాలెం మండలంలో పశువులకు టీకాలు వేసే కార్యక్రమాన్ని మొదలు పెట్టారు. లింగపాలెం పశు వైద్యశాలలో జరిగిన టీకాల

కార్యక్రమాన్ని సొసైటీ అధ్యక్షులు మొరంపూడి మల్లికార్జునరావు ప్రారంభించారు. ధర్మాజీగూడెం వైద్యశాలలో సహాయ సంచాలకులు లింగయ్య, లింగపాలెం వైద్యాధికారి కిరణ్ ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో 29,265 గేదెలు, 3268 ఆవులు ఉన్నాయని తెలిపారు. అక్టోబర్ 15 వరకు వీటికి టీకాలు వేస్తామని పేర్కొన్నారు. నాలుగు నెలలు దాటిన వాటన్నింటికీ గాలికుంటు వ్యాధి సోకకుండా టీకాలు వేస్తున్నట్లు వివరించారు. ప్రతి రైతు పెంచుతున్న పశువులకు టీకాలు వేయించుకోవాలని కోరారు. పశువుల ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం చూప వద్దని తెలిపారు. పశువుల ఆరోగ్యమే రైతులకు మహాభాగ్యంగా భావించాలని వైద్యాధికారులు వివరించారు. టీకాల కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

తిరుమలాపురం పీఏసీఎస్ అధ్యక్షుడిగా పండు

విశాలాంధ్ర-జంగారెడ్డిగూడెం : జంగారెడ్డిగూడెం మండలం తిరుమలాపురం సహకార పరపతి సంఘం అధ్యక్షుడిగా బల్లే పండు పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సహకార పరపతి సంఘం లోని రైతులకు అన్ని రకాల ఎరువులు అందుబాటులో ఉంచనున్నట్టు తెలిపారు. రైతుల అభివృద్ధితో పాటు సంఘ అభివృద్ధికి పాటుపడతానని అన్నారు. తిరుమలా పురం సహకార పరపతి సంఘం అధ్యక్షుడిగా

తన నియామకానికి కృషిచేసిన చింతలపూడి శాసనసభ్యులు సొంగా రోషన్ కుమార్, డిసిసిబి మాజీ చైర్మన్ కరాటం రాంబాబు, కరాటం ఉమా, చింతలపూడి నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి మేక ఈశ్వరయ్య తదితరులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలి

ఐజి అశోక్‌కుమార్‌ను మర్యాద పూర్వకంగా కలిసిన ఎస్పీ విద్యాసాగర్

విశాలాంధ్ర - ఏలూరు : పోలీస్ శాఖలో సమర్థవంతంగా విధులు నిర్వర్తించి మంచి గుర్తింపు పొందాలని ఏలూరు రేంజ్ ఐజి జివిజి.అశోక్ కుమార్ సూచించారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన సాధారణ బదిలీల్లో భాగంగా కృష్ణాజిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన వి.

విద్యాసాగర్ నాయుడు సోమవారం ఏలూరులోని రేంజ్ కార్యాలయంలో ఐజి అశోక్ ను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా విద్యాసాగర్ ను అభినందించిన ఐజి అశోక్ సమర్థవంతంగా విధులు నిర్వర్తించి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు.

అర్జీలను పరిష్కరించాలి

జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి

విశాలాంధ్ర -భీమవరం: పిజిఆర్ఎస్‌లో అందిన అర్జీల పరిష్కారం పారదర్శకత, నాణ్యతతో ఉండాలని, ఫిర్యాదుదారులతో మాట్లాడి నిర్ణీత గడువుగా పరిష్కారం చూపాలని, దరఖాస్తుల పరిష్కారంలో అలసత్వం వహించే అధికారు లపై చర్యలు తప్ప వని జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి అన్నారు. సోమ

వారం కలెక్టరేట్ పిజిఆర్ఎస్ సమావేశ మందిరంలో జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి తో పాటు డిఆర్ఓ బి.శివన్నారాయణ రెడ్డి, గ్రామ వార్డు సచివాలయ అధికారి వై.దోసి రెడ్డి, డ్వామా పిడి డాక్టర్ కె.సి.హెచ్.అప్పారావు, జిల్లా సర్వే అధికారి కె.జాషువా, జిల్లాలో పలు ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ఈ రోజు జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా జిల్లాలో పలు ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి 219 ఫిర్యాదులను స్వీకరించినట్టు తెలిపారు. సమావేశంలో డిపిఓ ఎం.రామనాథరెడ్డి, డి ఎం అండ్ హెచ్ ఓ జి.గీతా బాయి, డీఎస్ఓ ఎం.సరోజ మున్సిపల్ కమిషనర్ కె. రామచంద్రారెడ్డి, వయోవృద్ధుల సంక్షేమ ట్రిబ్యునల్ సభ్యులు మేళం దుర్గాప్రసాద్, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో హనీకి గోల్డ్ మెడల్

విశాలాంధ్ర-టి నరసాపురం: రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 7వ తరగతి విద్యార్థిని గుర్రం హని గోల్డ్ మెడల్ సాధించినట్లు ఆమె తండ్రి గుర్రం నాగరాజు సోమవారం తెలిపారు. మండలంలోని పుట్రేపు గ్రామానికి చెందిన గుర్రం నాగరాజు, భారతి దంపతుల చిన్న కుమార్తె హనీ చింతలపూడిలోని మేరీ ఇమ్మాక్యులేట్ హైస్కూల్లో 7వ తరగతి చదువుతోంది.

పాఠశాలలో కరాటే మాస్టారుగా పనిచేస్తున్న పి.సుమన్ రాజ్ పర్యవేక్షణలో కరాటే శిక్షణ పొందిన కొందరు విద్యార్థులు ఈనెల 14వ తేదీన ఆదివారం అమలాపురంలో జరిగిన రాష్ట్ర స్థాయి 5వ ఇంటర్ స్టేట్ ఇన్విటేషనల్ ఓపెన్ కరాటే చాంపియన్షిప్ -2025 పోటీల్లో పాల్గొన్నారు. ఈ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన హనీ బంగారు పతకం సాధించింది. ఆమెను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సిస్టర్ సోఫియా, కరస్పాండెంట్ సిస్టర్ దినియ, పాఠశాల సిబ్బంది కుటుంబ సభ్యులు, పుట్రేపు గ్రామపెద్దలు అభినందించినట్లు ఆయన తెలిపారు. చిన్నతనం లోనే కరాటేలో మంచి ప్రతిభ కనబరిచి బంగారు పతకం సాధించడం ఆనందంగా ఉందని కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

వలస గిరిజనులకు వసతులు కల్పించాలి : సీపీఐ

ఎమ్మార్వో కార్యాలయం ఎదుట ధర్నా

విశాలాంధ్ర - కుక్కునూరు: విలీన మండలం కుక్కునూరు ఏజెన్సీ ప్రాంతం లోని వలస గిరిజనులకు మెరుగైన వసతులు కల్పించాలని సీపీఐ కుక్కునూరు మండల కార్యదర్శి కొన్నె లక్ష్మయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఐ ఆధ్వర్యంలో వలస గిరిజనులు సోమవారం కుక్కునూరు ఎమ్మార్వో కార్యాలయం ఎదుట తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా లక్ష్మయ్య మాట్లాడుతూ పొట్టకూటి కోసం సొంత రాష్ట్రం నుంచి వలస వచ్చిన గిరిజనులను ఇక్కడి ప్రభుత్వం పట్టించుకున్న పాపాన పోలేదని ఆరోపించారు. 20 ఏళ్ల నుంచి ఇక్కడే ఉంటున్నా వారికి కుల ధ్రువీకరణ పత్రం ఇవ్వడంలో పాలకులు, అధికారులు పట్టించు కోకుండా జాప్యమెందుకు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కులధ్రువీకరణ లేకపోవడంతో అర్హులైన వలస గిరిజనులు ఉద్యోగాలు కోల్పోతు న్నారని వాపోయారు. వలస గిరిజన గ్రామాల్లో రహదారుల సౌకర్యం లేక గర్భిణీలు ప్రసవం కోసం పడరాని పాట్లు పడుతున్నారని తెలిపారు. నేటికి డోలీలతోనే గర్భిణీలను ఆసుపత్రికి తరలించడం వంటి సంఘటనల పట్ల ప్రభుత్వానికి కనువిప్పు కలగాలని కోరారు. వలస గిరిజనుల గ్రామాలకు రహదారులు, మెరుగైన వైద్యం, విద్య అందించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఎమ్మార్వో ఆఫీస్ సిబ్బందికి అందజేశారు.

ఈ కార్యక్రమంలో సోడే నాగేష్,రమేష్, మారయ్య, శ్రీను, మడకం భీమయ్య, సోడే ఇరమయ్య, మడకం ఇరుమ, మడకం కోసయ్య, సోనా దూలయ్య తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగి ఆవేదనా సదస్సును జయప్రదం చేయండి

విశాలాంధ్ర- చింతలపూడి: రాష్ట్రవ్యాప్తంగా నిరుద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఈ నెల 17న విజయవాడలో జరగనున్న నిరుద్యోగుల ఆవేదన సదస్సును జయప్రదం చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా కో కన్వీనర్ తొర్లపాటి రాజు పిలుపునిచ్చారు. సోమవారం చింతలపూడిలోని సీపీఐ కార్యాలయంలో నిరుద్యోగ ఆవేదన సదస్సుకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వశాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని, నిరుద్యోగులకు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు నిరుద్యోగ భృతి రూ. 3 వేలు చెల్లించాలని,అమరావతి రాజధాని ప్రాంతాన్ని ఫ్రీ జోన్‌గా ప్రకటించి అన్ని ప్రాంతాలవారికి ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నారు. పరిశ్రమల్లో స్థానిక నిరుద్యోగ యువతకు 70 శాతం ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, ప్రభుత్వ విద్యాల యాల్లో ప్రొఫెసర్, లెక్చరర్, టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బందితో పాటు లైబ్రరీలలో ఖాళీగా వున్న పోస్టులను భర్తీ చేయాలని, ఎస్సీ ఎస్టీ బ్యాక్ లాగ్ పోస్టులను అన్ని విభాగాల్లోనూ భర్తీ చేయాలన్నారు. వాలంటీర్ లను కొనసాగిస్తూ వంటీర్ లలో విద్యార్హత ఆధారంగా ప్రభుత్వ ఉద్యోగాల్లో భర్తీకి అవకాశం కల్పించాలని,పేద నిరుద్యోగ యువతకు ఉచిత స్టడీ సర్కిల్ అందించాలనే డిమాండ్లతో ఈ రాష్ట్ర నిరుద్యోగ సదస్సును నిర్వహించనున్నట్టు తెలిపారు. ప్రభుత్వం శాసనసభ సమావేశాల్లో ఈ అంశాలపై చర్చించి, నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించే దిశగా అడుగులు వేయాలన్నారు. ఈనెల 17న విజయవాడలో జరగనున్న నిరుద్యోగుల ఆవేదన సదస్సుకు జిల్లాలోని యువత,నిరుద్యోగులు పెద్ద ఎత్తున తరలి వచ్చి జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు సాయిల అవినాష్, పిట్ట చందు, తొర్లపాటి అంబేద్కర్, ముళ్లగిరి నాని, జి. శాంసన్ పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలు అందించండి

విశాలాంధ్ర - ఏలూరు : విధి నిర్వహణలో ప్రజలకు మెరుగైన సేవలు అందించి పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకురావాలని ఏలూరు జీవిజి అశోక్ కుమార్ సూచించారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన సాధారణ బదిలీల్లో భాగంగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన రాహుల్ మీనా సోమవారం ఏలూరులోని రేంజ్ కార్యాలయంలో ఐజి అశోక్ ను మర్యాద పూర్వకంగా కలుసుకొని పుష్పగుచ్ఛం అందజేశారు.

ఈ సందర్భంగా ఐజి అశోక్ కోనసీమ ఎస్పీ రాహుల్‌కు శుభాకాంక్షలు తెలిపి సమర్థవంతంగా విధులు నిర్వహించి మంచి పేరు సంపాదించాలని సూచించారు.

కాజ్‌వే బ్రిడ్జిని ప్రారంభించిన శాసనసభ్యులు

విశాలాంధ్ర - జంగారెడ్డిగూడెం : జంగారెడ్డిగూడెం మండలం పట్టినపాలెం బ్రిడ్జి వద్ద రూ.73 లక్షలతో నిర్మించిన కాజ్ వే వంతెనను చింతలపూడి శాసనసభ్యులు సొంగా రోషన్ కుమార్, పోలవరం శాసన సభ్యులు చిర్రి బాల రాజు ప్రారంభించారు. దాదాపు 25 గ్రామాలకు అనుసంధానం చేసే పట్టిన పాలెం కాజ్ వేను ప్రారంభించడం

ద్వారా అనేక గ్రామాలకు రహదారి ఏర్పడిందని ప్రజలు హర్షాతిరేకం వ్యక్తం చేస్తున్నారు. చింతల పూడి నియోజకవర్గంలోని కొన్ని గ్రామాలు పోలవరం నియోజకవర్గంలోని కొన్ని గ్రామాలు తెలంగాణ రాష్ట్రంలోని మరికొన్ని గ్రామాలకు అనుసంధానం చేసే ఈ రహదారిపై కాజ్‌వే అత్యంత ఆవశ్యకతను గుర్తించిన శాసనసభ్యులు నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తయ్యేలా కృషి చేసి అనంతకాలంలోనే ప్రజలకు అంకితం చేశారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి మాజీ చైర్మన్ కరాటం రాంబాబు, కరాటం ఉమా, చింతలపూడి నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి మేక ఈశ్వరయ్య, కూటమి నాయకులు పలువురు పాల్గొన్నారు.

రవాణా వ్యవస్థకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టండి

విశాలాంధ్ర - జంగారెడ్డిగూడెం : తుపాను ప్రభావంతో ఉధృతంగా వచ్చిన వరదలకు రెడ్డి గణపవరం కాజ్వే కొట్టుకు పోయింది. ఈ పరిస్థితిని పోల వరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన సంబంధిత అధికారులతో మాట్లాడి, రవాణా వ్యవస్థకు ఎలాంటి ఇబ్బందులు కలగ కుండా తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో

జనసేన జిల్లా కార్యదర్శి గడ్డమనగు రవికుమార్, మండల ప్రెసిడెంట్ బుచ్చిరాజు, వైస్ ప్రెసిడెంట్ పండు, మండల సెక్రటరీ రాజా, జనరల్ సెక్రటరీ గురజాల వెంకటేశ్వరరావు, జిల్లా సంయుక్త కార్యదర్శి పాదం కృష్ణ, మాణికల దుర్గారావు, తుష్టి వెంకటేశ్వరరావు, కొక్కిర పద్మరాజు తదితరులు పాల్గొన్నారు.

పశువులకు గాలి కుంటు వ్యాధి నిరోధక టీకాలు

విశాలాంధ్ర- పాలకోడేరు : పాలకోడేరు మండల వ్యాప్తంగా అక్టోబరు 15 వరకు ప్రతి గ్రామంలోనూ పశువులకు ఉచితంగా గాలి కుంటు వ్యాధి నిరోధక టీకాలు వేయనున్నట్లు మండల పశు వైద్యాధికారి టి. హేమ తెలిపారు. పశువులకు తీవ్రమైన జ్వరం, నీరసం, నోటి నుండి సొంగ కారడం, కాలి గిట్ల పుండ్లు, చూడి ఇసుకపోవడం, పాల ఉత్పత్తి గణనీయంగా తగ్గిపోవడం వంటి లక్షణాలు కలిగి ఉండ టం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. పాడి రైతులు అపోహలకు పోకుండా తప్పకుండా ఈ వ్యాధి నిరోధక టీకాలు తమ పశువులకు వేయించు కోవాలని కోరారు.

సోమవారం మోగల్లు గ్రామంలో సుమారు 200 పశువులకు ఈ వ్యాధి నిరోధక టీకాలు వేసినట్లు తెలిపారు.

ఈవ్ టీజింగ్ చేస్తే కఠిన చర్యలు

విశాలాంధ్ర - గణపవరం: స్కూళ్లు, కాలేజీలు వద్ద సీనియర్లు, ఇతరులు బాలికలపై ఈవ్ టీజింగ్ చేస్తే కఠిన చర్యలు తప్పవని నిడమర్రు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ నక్కా రజిని కుమార్ అన్నారు. సోమవారం గణపవరం జిల్లా పరిషత్ బాలికల హై స్కూల్ వద్ద విద్యార్థులకు అవగాహన

కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ సైబర్ నేరగాళ్ల వలలో పడకుండా ఉండాలని ప్రతి విద్యార్థి చదువుతోపాటు సోషల్ యాక్టివిటీస్ పై దృష్టి సారించాలని అన్నారు. ఈవ్ టీజింగ్ జరక్కుండా, ఆడపిల్లలకు రక్షణ గా శక్తి యాప్ గురించి అవగాహన కల్పించారు. సీఐ వెంట గణపవరం ఎస్ఐ ఎ. మణికుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అధ్వాన్నంగా ఉన్న రోడ్డు అభివృద్ధి చేయాలి

విశాలాంధ్ర-టి.నరసాపురం: మండల కేంద్రమైన టి నరసాపురం అంబేద్కర్ సెంటర్ నుండి సినిమా హాల్ సెంటర్ వరకు అధ్వాన్నంగా ఉన్న రోడ్డు అభివృద్ధి చేయాలని కోరుతూ గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్తలు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో తహసిల్దార్ టి.సాయిబాబా,

ఎంపీడీవో జి.నగరాజ కుమారి లకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సామాజిక కార్యకర్త ఎస్ డి నాసర్ పాషా మాట్లాడుతూ మండల కేంద్రం టి నరసాపురం అంబేద్కర్ సెంటర్ నుండి బంధంచర్ల రోడ్డులోని విజయలక్ష్మి థియేటర్ వరకు రోడ్డు అధ్వాన్నంగా తయారైందన్నారు. డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేక రోడ్డుపై ఉన్న గుంతల్లో వర్షపు నీరు నిలిచి చెరువును తలపిస్తోందని అన్నారు. దీని వల్ల వాహనదారులతో పాటు కాలినడకన వెళ్ళే ప్రజలు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. తూర్పుగూడెం, గండిగూడెం, కొరివి రామన్న పాలెం, బంధంచర్ల, కె. జగ్గవరం, అల్లంచర్ల రాజు పాలెం, తెడ్లం, జీలకర్రగూడెం, కామవరపుకోటకు చెందిన ప్రజలు ఈ రహదారిమీదుగానే ప్రయాణిస్తుంటారని ఆయన తెలిపారు. ఈ అంశంపై పలుమార్లు ప్రజా ప్రతినిధులకు, అధికారులకు వినతి పత్రాలు అందజేశామన్నారు. అధికారులు తాత్కాలిక మరమ్మతులు చేసినప్పటికీ తిరిగి రోడ్డు యధాస్థితికి చేరుతుందని అన్నారు. అధికారులు స్పందించి అంబేద్కర్ సెంటర్ నుండి సినిమా హాల్ సెంటర్ వరకు సిసి రోడ్డు, ఇరువైపుల డ్రైనేజీ ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జమీల బేగం, సామాజిక కార్యకర్తలు కొరివి వెంకటేశ్వరరావు, కొరివి నాగేశ్వరరావు, పింగుల మధు, రెడ్డి శ్రీనివాస్, బొద్దపాటి రమేష్, నార్లపాటి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మోక్షగుండం సేవలు అమోఘం

విశాలాంధ్ర- వీరవాసరం: మోక్షగుండ విశ్వేశ్వరయ్య ప్రపంచ ఖ్యాతి చెందిన ఇంజనీర్ గా ఖ్యాతి గడించారని, సాంకేతిక విజ్ఞానంలో ఆయన చేసిన సేవలు నేటి యువ ఇంజనీర్లు నేర్చుకోవాలని వీరవాసరం కళాపరిషత్, కాపు సర్వీస్ క్లబ్ అధ్యక్షుడు గుండా రామకృష్ణ అన్నారు. స్థానిక కాపు సర్వీస్ క్లబ్ కార్యాలయంలో భారతరత్న మోక్షగుండం

విశ్వేశ్వరయ్య 164 జయంతిని ఘనంగా నిర్వహించారు. విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ మోక్షగుండం విశ్వేశ్వరయ్య ఇంజనీర్‌గా ప్రసిద్ది చెందిన కావేరి నది పై కృష్ణరాజ సాగర్ ని నిర్మించిన ఘనత, బంగాళాఖాతం వలన సముద్రంలో రాకాసి అలలు విశాఖపట్నం ప్రాంతాన్ని అతలాకుతలం చేస్తున్న పరిస్థితుల్లో అక్కడికి వెళ్లి అలలు ఒడ్డు దాటి రాకుండా ప్రాణ రక్షణ, ఆస్తి రక్షణకు తనకున్న ఇంజనీరింగ్ పరిజ్ఞానంతో ప్రతిపాదనలు తయారు చేసిన గొప్ప ఇంజినీరని కొనియాడారు. అనంతరం వీరవాసరం పాలిటెక్నిక్ కళాశాల పూర్వపు విద్యార్థి నేటి ఆర్.అండ్.బి మండల ఇంజనీర్ మూర్తిని ఘనంగా సన్మానించారు. సన్మాన గ్రహీత మూర్తి మాట్లాడుతూ విశ్వేశ్వరయ్య జయంతి రోజున తనకు జరిగిన సన్మానం జీవితాంతం గుర్తుపెట్టు కుంటానన్నారు. కార్యక్రమంలో వనిత క్లబ్ అధ్యక్షులు డాక్టర్ బి.లక్ష్మీ కళ్యాణి, భీమవరం కళాపరిషత్ అధ్యక్షులు జవ్వాది దాశరధి శ్రీనివాస్, కెవిఎల్ ప్రసాద్, కుంచె వేణు, అన్నపూర్ణ, గుండా స్వాతి, పాలా మహేంద్ర తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌ను భీమవరం ఏఎంసీలోనే నిర్మించాలి

ప్రజా సంఘాల ఆందోళన

విశాలాంధ్ర -భీమవరం: భీమవరం మార్కెట్ యార్డులో కలెక్టరేట్ ఏర్పాటు చేయడానికి అన్ని విధాల అనువైన ప్రాంతమని, వెంటనే నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చెల్ల బోయిన రంగారావు, ఎం. సీతారాం ప్రసాద్, సీపీఎం జిల్లా కార్యదర్శి జె.ఎన్.వి. గోపాలన్ అన్నారు. కలక్టరేట్ నిర్మాణ సాధన కమిటీ ఆధ్వర్యంలో సిపిఐ, సిపిఎం, ఎంసిపిఐయు, ఫార్వర్డ్ బ్లాక్, ప్రజా సంఘాలు భీమవరం ఎ.ఎం.సి లోని కలక్టరేట్ స్థలాన్ని సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కలెక్టరేట్ నిర్మాణానికి అవసరమైన స్థలం ఇక్కడ ఉందన్నారు. కొద్దిమేర గోడౌన్స్ ఉన్నా ఎక్కువ భాగం ఖాళీగా గడ్డి, చెట్లతో నిండి ఉందన్నారు. ఈ ఖాళీ స్థలంలో కలెక్టరేట్‌కి ఏదైతే గతంలో ఇచ్చిన జి.ఒ ప్రకారం కలెక్టరేట్‌ను నిర్మించడం వల్ల జిల్లాలోని అన్ని నియోజకవర్గాలకు అనువైన ప్రాంతం అన్నారు. ప్రజానీకానికి రవాణా సౌకర్యాలకు అందుబాటులో ఉన్న ప్రాంతం మార్కెట్ యార్డే తప్ప మరొకటి కాదన్నారు. గత ప్రభుత్వం 124 జి.ఒని విడదల చేయ డం ఎన్నికల వల్ల శంకుస్థాపన జాప్యం జరిగిందని, కూటమి ప్రభుత్వం వచ్చాక కలెక్టరేట్ నిర్మాణం మార్కెట్ యార్డు అనే ఊసే ఎత్తకుండా దీనిపై రాజకీయం చేస్తున్నారని

నాయకులు విమర్శించారు. అన్ని విధాల అనుకూలమైన మార్కెట్ యార్డులోనే కలెక్టరేట్ నిర్మాణం చేపట్టేం దుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని నాయకులు డిమాండ్ చేశారు. కార్యక్ర మంలో సీపీఐ పట్టణ సహాయ కార్యదర్శి మల్లుల శ్రీనివాసరావు, నాయకులు తిరుమాని కామేశ్వరరావు, నాగిడి శాంత మూర్తి, చాన్‌బాషా, ఎం సిపిఐయు జిల్లా నాయకులు కొల్లాబత్తుల మహంకాళి, ఫార్వర్డ్‌బ్లాక్ డివిజన్ కార్యదర్శి దండు శ్రీనివాసరాజు, పట్టణ ప్రజల సంక్షేమ సంఘం నాయకులు ఎం.వైకుంఠ రావు, సిపిఎం పట్టణ నాయకులు మల్లిపూడి ఆంజనేయులు, బొక్కా సత్యనారాయణ, వడుగు వెంకటేశ్వరరావు, సిఐటియు పట్టణ కన్వీనర్ దేగల నాగు, బజారు ముఠా వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు కోర్ల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చక్రద్వారబంధం

(1వ పేజీ తరువాయి)

శూన్యమన్నారు. వీధి దీపాలు మరమ్మతులు చేస్తున్నారో లేదో తెలియని దుస్థితి నెలకొందన్నారు. గోదావరి త్రాగు నీరు వారంలో ఒకటి,రెండు సార్లు మాత్రమే వస్తున్నాయన్నారు. వర్షాకాలంలోనే ఇలా ఉంటే రానున్న వేసవి కాలంలో పరిస్థితి ఎలా ఉంటుందో అని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత నవంబర్ నెలలో అప్పటి జిల్లా కలెక్టర్ ప్రశాంతికి మంచినీటి సమస్యలపై ఫిర్యాదు చేయగా స్పందించిన జిల్లా కలెక్టర్ తమ గ్రామాన్ని పర్యటించి తాగు నీటి కోసం రు.16.30 లక్షలతో బోరు నిర్మాణానికి నిధులు మంజూరు చేశారన్నారు. గ్రామీణ నీటి సరఫరా, పరిశుభ్రత, స్థానిక పంచాయతీ అధికారులు కలిసి తమ గ్రామానికి బోరు ఏర్పాటు చేశారన్నారు. కొంతమంది అవగాహన లోపం కారణంగా వేసిన బోరు పనులతో కేవలం 2 అంగుళాలు నీరు మాత్రమే వస్తుందన్నారు. దీంతో బోరు కొట్టినా ఫలితం లేదనీ, నీరు సరిపోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏ పంచాయతీలో లేని విధంగా ఏకంగా 18 మంది పంచాయతీ సిబ్బంది ఉన్నారని వాపోయారు. అంత మంది ఉన్నా గ్రామంలో అభివృద్ధి సున్నా అని విమర్శించారు. గ్రామంలో ఏ శుభకార్యం జరిగినా వారిలో కొంతమంది పంచాయతీకి అనధికారంగా సెలవు పెట్టి ఫంక్షన్ జరిగే చోట శానిటరీ, క్లీనింగ్ పనులు చేపడతారని, వారి వద్ద నుండి దాదాపు 2500 తీసుకుంటారని పేర్కొంటున్నారు. అదే సమయంలో పంచాయతీ నుండి కూడా జీతభత్యాలు యధావిధిగా తీసుకుంటారని ఆరోపించారు. ప్రజల నుండి వసూలు చేసిన 39 లక్షలలో ప్రస్తుతం 11.90 లక్షలు మిగిలి ఉన్నాయని, ప్రతి నెల రెండు లక్షలు సిబ్బంది జీతాలు అందులో నుండే ఇస్తున్నారని అవేదన వ్యక్తం చేశారు. జిల్లా పంచాయతీ అధికారి మెప్పు కోసం తమ పంచాయతీ కార్యదర్శి ఉదయమే ఏదో ఒక చోట ఫొటోలు తీసుకొని వెళ్లిపోతారని వాపోయారు. అధికారులు మెప్పు కోసం కాకుండా గ్రామ అభివృద్ధి కోసం పనులు చెయ్యాలని కోరారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి తక్షణమే విద్యుత్ దీపాలు రాత్రి వేళల్లో నిరంతరం వెలిగేలా చర్యలు చేపట్టాలని, మంచినీటి సమస్య రూపుమాపాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

సమాజాభివృద్ధిలో ఇంజనీర్ల పాత్ర కీలకం

ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్

విశాలాంధ్ర-తణుకు: సమాజ అభివృద్ధిలో ఇంజనీర్ల నూతన ఆలోచనలు ఎంత గానో ఉపయోగ పడతా యని శాసన మండలి సభ్యులు వంక రవీంద్రనాథ్ అన్నారు. పైడిపర్రు-తేతలి లయన్స్ క్లబ్

ఆధ్వర్యంలో నిర్వహించిన ఇంజనీర్ డే కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మోక్షగుండం విశ్వేశ్వరయ్య చేసిన కృషిని కొనియాడారు. ముఖ్యంగా బ్లాక్ సిస్టమ్ కనుగొని, గ్రామాలలో నీటి పారుదల వ్యవస్థను కనుగొన్నారని, అనేక ప్రాజెక్టులను విజయవంతంగా రూపకల్పన చేశారన్నారు.ఈ సందర్భంగా ఇంజనీర్స్ అగస్టీన్, రామకృష్ణ,శ్రీనివాస రావు,మాదిరెడ్డి బాపూజీ రావు తదితరులకు సన్మానం చేశారు.ఈ కార్యక్రమం కంబాల రంగారావు అధ్యక్షతన జరుగగా జిల్లా సర్వీస్ కోఆర్డినేటర్ తణుకు మాజీ మునిసిపల్ చైర్మన్ వంక రాజకుమారి, జోన్ చైర్మెన్ మాదిరెడ్డి కృష్ణ కుమారి,వంటేద్దు సోమ సుందర రావు , కుదారి సజని , డాక్టర్ ఆనంద్,వంటేద్దు వాణి తదితరులు పాల్గొన్నారు.

కెమిస్ట్రీ అధ్యాపకులు మస్తాన్‌రావుకు నివాళి

విశాలాంధ్ర -నూజివీడు :ఆర్జీయుకేటీ నూజివీడులో గత 16 సంవత్సరాలుగా కెమిస్ట్రీ అధ్యాపకులుగా పనిచేస్తున్న డాక్టర్ జక్కా మస్తాన్‌రావు 13వ తేదీన అనారోగ్య కారణాలతో మృతి చెందారు. నిబద్ధత కలిగిన అధ్యాపకులుగా విద్యార్థుల్ని

ఉన్నతంగా తీర్చిదిద్దడానికి ఎంతో కృషి చేసిన మస్తాన్‌రావు ఆకస్మిక మృతికి అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది తీవ్ర సంతాపాన్ని తెలియజేశారు. సోమవారం జరిగిన సంతాప సమావేశానికి అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది హాజరై మస్తాన్‌తో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఆర్జీయుకేటీ రిజిస్ట్రార్, నూజివీడు క్యాంపస్ డైరెక్టర్ ఆచార్య సండ్ర అమరేంద్ర కుమార్ మాట్లాడుతూ 'విద్యార్థికుడు, మంచి అధ్యాపకుడు అయిన మస్తాన్ రావును కోల్పోవడం ఎంతో బాధాకరమన్నారు. శాఖాధ్యక్షులుగా, పీయూసీ కో-ఆర్డినేటర్'గా ఆయన సేవలు గణనీయమని, ఆయన మృతికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నానని అన్నారు. ఛాన్సలర్, వైస్ ఛాన్సలర్ పంపించిన సంతాప సందేశాన్ని చదివి వినిపించారు. కార్యక్రమంలో సెంట్రల్ డీన్ శ్రావణి, డీన్ శ్యామ్, పరిపాలనాధికారి డాక్టర్ లక్ష్మణరావు, డీన్ అకడమిక్స్ డాక్టర్ సాదు చిరంజీవి, ఫైనాన్స్ ఆఫీసర్స్ డాక్టర్ నాగార్జునదేవి, డాక్టర్ శ్రీనాథ్, ఈసీఈ అధ్యాపకులు వినోద్ ఇంకా కెమిస్ట్రీ శాఖ అధ్యక్షులు శ్రీను, ఇతర కెమిస్ట్రీ అధ్యాపకులతో పాటు పీయూసీ అన్ని విభాగాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొని తమ తీవ్ర సంతాపాన్ని తెలియజేశారు.

దున్నపోతు దాడిలో పశువుల కాపరి మృతి

విశాలాంధ్ర - బుట్టాయిగూడెం: దున్నపోతు దాడి చేయడంతో తీవ్రంగా గాయపడిన పశువుల కాపరి మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం కొత్తపేటకు చెందిన బడుగు సత్యనారాయణ(38) పశువుల కాపరిగా జీవనం గడుపు తుంటాడు. పశువులను మేపే

క్రమంలో సత్యనారాయణ ఆదివారం పశువులను తోలుకొని ఊరి బయట పొలాలలోకి వెళ్ళాడు. అక్కడ మందలోని దున్నపోతు ఒక్కసారిగా సత్యనారాయణ పై దాడి చేసి, నేలపై పడవేసి తీవ్రంగా పొడిచి, కుమ్మడంతో తీవ్ర గాయాలైన సత్యనారాయణ సంఘటన స్థలంలోనే చనిపోయినట్లు తెలుస్తుంది. దూరం నుండి దున్నపోతు దాడి సంఘటన గమనించిన స్థానికులు సంఘటన స్థలానికి వెళ్లేటప్పటికి సత్యనారాయణ మృతి చెందినట్లు చెబుతున్నారు. సంఘటనపై మృతుడి భార్య దుర్గ ఫిర్యాదు మేరకు బుట్టాయిగూడెం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని జంగారెడ్డిగూడెం ప్రభుత్వాసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

SBFC
ఎస్‌బిఎఫ్‌సి ఫైనాన్స్ లిమిటెడ్
రిజిస్టర్డ్ ఆఫీస్: యూనిట్‌నం: 103, 1వ అంతస్తు, సి&బి స్క్వేర్, సంగం కాంప్లెక్స్, సిటిఎస్ నం.95ఎ, 127, అంధేరి కుర్లా రోడ్, చాకల (గ్రామం, అంధేరి(ఇ),ముంబై-400059 (టెలిఫోన్ : +91 22 67875300), ఫ్యాక్స్: +91 22 67875334 (WWW.SBFC.COM) కార్పొరేట్‌గుర్తింపుసంఖ్య:యు67190ఎంహెచ్2008పిఎల్‌సి178270

బహిరంగ ప్రకటన

దిగువ పేర్కొన్న బ్రాంచ్ చిరునామా వద్ద తాకట్టు పెట్టబడిన బంగారు ఆభరణాలు ఎస్‌బిఎఫ్‌సి ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్ ద్వారా తేదీ: 23, సెప్టెంబరు 2025 - ఉదయం 10.30 గంటలకు కింది బ్రాంచ్ చిరునామాలో వేలం వేయబడునని ఇందుమూలంగా యావన్మంది ప్రజానీకానికి తెలియజేయడమైనది. వేలం వేయబడు బంగారు ఆభరణాలు, బకాయిలు చెల్లించుటలో విఫలమైన మా యొక్క వేర్వేరు ఖాతాదారుల లోన్ ఎకౌంట్లకు చెందినవి. ఈ రుణగ్రహీతలకు మా నుండి నోటీసు సక్రమంగా జారీ చేయబడినవి. వేలానికి పెట్టిన బంగారు ఆభరణాలు... ఈ కింద పేర్కొన్న బ్రాంచి వివరాలలో పేరు వేర్వేరు ఖాతాదారుల కస్టమర్ ఐడీతో అనుసంధానమై ఉన్న అన్ని ఎకౌంట్లకు చెందినవి.

ఏలూరు	ఎస్‌బిఎఫ్‌సి ఫైనాన్స్ లిమిటెడ్, 23బి-593/1, సావిత్రి కాంప్లెక్స్, 1వ అంతస్తు, ఈదరవారి వీధి, ఏక్సిస్ బ్యాంక్ పక్కన, ఆర్.ఆర్.పేట్, ఏలూరు , ఆంధ్రప్రదేశ్,, ఏలూరు, AP00695757
రాజాం	బ్రాంచ్ చిరునామా: ఎస్‌బిఎఫ్‌సి ఫైనాన్స్ లిమిటెడ్,డోర్ నెం.15-4-41, చీపురుపల్లి రోడ్డు, రెవిన్యూ వార్డ్ నం.8, రాజాం,ఆంధ్రప్రదేశ్-532127, రాజాం, AP00671948,AP00672963,AP00756834

మరిన్ని వివరాల కొరకు, దయచేసి ఎస్‌బిఎఫ్‌సి ఫైనాన్స్ లిమిటెడ్ యొక్క సంప్రదించు నంబరు(లు) : 18001028012 నందు సంప్రదించగలరు. (వేలం వేయబడు ఖాతాల సంఖ్యలు మార్చుటకు & ఏటువంటి ముందస్తు నోటీసు లేకుండానే వేలాన్ని వాయిదా/రద్దు చేయుటకు ఎస్‌బిఎఫ్‌సి ఫైనాన్స్ లిమిటెడ్ హక్కు కలిగియున్నది.)

CHANGE OF NAME
I, GUBBALA SURESH CHANDRA (New Name), S/O Gubbala Peddi Raju, Previously Called GUBBALA SURESH (Old Name), Resident of D.No.1-144, Kalagampudi Village, Yelamanchili Mandal, W.G.Dt., Pin-534268, Andhra Pradesh. I have changed my name from **GUBBALA SURESH (Old Name)** To **GUBBALA SURESH CHANDRA (New Name)** for all practical purposes.

అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

విశాలాంధ్ర - కడియం : కూటమి ప్రభుత్వం అభివృద్ధికి సంక్షేమానికి పెద్దపీట వేస్తుందని రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి అన్నారు. మండల కేంద్రమైన కడియం గ్రామంలో కడియం బొబ్బిలి బ్రిడ్జి సెంటర్ నుంచి జేగురుపాడు ఆదాని రేవు వరకు గల కాలువ గట్టు రోడ్డును సుమారు రూ.2.60 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించేందుకు శంకుస్థాపన శారు. అనంతరం జేగురుపాడు పంచాయితీ పరిధిలోని పాములమెట్ట వద్ద, ఐదు లక్షల విలువ చేసే మోటార్ ను ప్రారంభించారు. ఈకార్యక్రమంలో కడియం ఎంపీపీ వెలుగుబంటి వెంకట సత్య ప్రసాద్, కడియం సర్పంచ్ మోసిగంటి సత్యవతి, మాధవరాయుడు పాలెం సర్పంచ్ అన్నందేవుల చంటి, కడియపు సావరం సర్పంచ్ చెక్కపల్లి మురళీకృష్ణ, ఉప సర్పంచ్‌లు వెలుగుబంటి రఘురాం, పాతూరి రాజేష్, కూటమి నాయకులు, గట్టి నరసయ్య, మార్గాని సత్యనారాయణ, పంతం గణపతి, గట్టి సుబ్బారావు, ప్రత్తిపాటి రామారావు చౌదరి, ముద్రగడ జెమీ, జేగురుపాడు ఎంపీటీసీ నాగిరెడ్డి సూర్య రామకృష్ణ, మర్రెడ్డి రమేష్, కర్రి చినబాబు, స్థానిక అధికారులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత : జేసీ

విశాలాంధ్ర - రాజమండ్రి సిటీ : ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో వచ్చిన అర్జీలకు గడువులోగా సంతృప్తి స్థాయిలో పరిష్కారం చూపాలని సంబంధిత అధికారులను అదనపు కమిషనర్ పి.వి. రామలింగేశ్వర్ ఆదేశించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికను సోమవారం నిర్వహించగా.. మొత్తం 21 అర్జీలు వచ్చాయి. వీటిలో రెవెన్యూకి సంబంధించి ఒకటి, టౌన్ ప్లానింగ్ కి సంబంధించి 5, ఇంజనీరింగ్ కి సంబంధించి 10, వార్డు సచివాలయాలకు సంబంధించి 3, పబ్లిక్ హెల్త్ కి సంబంధించి 1, మెప్మాకు సంబంధించి ఒకటి ఉన్నాయి. ఈ సందర్భంగా అదనపు కమిషనర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. కనుక అర్జీలకు ప్రణాళికబద్ధంగా సంబంధిత అధికారులు పరిష్కారం చూపాలన్నారు. సమర్పించిన అర్జీ పరిష్కారం కాలేదనే ఫిర్యాదు ఎక్కడా రాకూడదని.. ప్రజల నుండి స్వీకరించే ప్రతీ అర్జీకి సరైన ఎండార్స్ మెంట్ ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ ఎస్.వెంకట రమణ, సెక్రటరీ జి.శైలజ వల్లి, సిటీ ప్లానర్ జి.కోటయ్య, ఎంహెచ్ఓ వినూత్న, ఎస్ఈ(ఇంఛార్జి) రీటా, మేనేజర్ ఎండి అబ్దుల్ మాలిక్, రెవిన్యూ ఆఫీసర్ సీహెచ్ శ్రీనివాసరావు, అధికారులు పాల్గొన్నారు.

స్వస్త్‌నారీ -సశక్తి పరివార్‌పై అవగాహన

విశాలాంధ్ర - సీతానగరం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న స్వస్త్‌నారీ స్వశక్తి పరివార్ కార్యక్రమంపై అధికారులకు అవగాహన కల్పించారు. సోమవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు డాక్టర్ చైతన్య, దా యేసురాణి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ చైతన్య మాట్లాడుతూ సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 2 వరకూ ప్రతీ గ్రామంలో స్త్రీలకు, పిల్లలకు కాన్సర్ స్క్రీనింగ్, మధుమేహం, బీపీ, రక్తహీనత పరీక్షలు, క్షయ వ్యాధి పరీక్షలు, గర్భిణీ, బాలింత సేవలు, ఆయుష్మాన్ భారత్ రిజిస్ట్రేషన్ ,సైకిల్ సెల్ వ్యాధి నిర్ధారణ పరీక్ష, పోషకాహారం గురించి అవగాహన మొదలగు కార్యక్రమాలు ఆరోగ్య సిబ్బందితో నిర్వహించడం జరుగుతుందన్నారు. సెప్టెంబర్ 17న ప్రాదమిక ఆరోగ్య కేంద్రంలో ప్రారంభించడం జరుగుతుంది. మండల ప్రజలు ఈ సదా అవకాశని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తహసిల్దార్ శ్రీనివాస్, అదనపు ఎంపిడిఓ మూర్తి, ఏ ఓ సుబ్రమణ్యం, ఐసిడిఎస్ సూపర్వైజర్ పెదలక్ష్మి, వైద్య ఆరోగ్య, ఐసిడిఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీల నిధులు ఏమయ్యాయో : ఎమ్మెల్యే

విశాలాంధ్ర - రాజమండ్రి సిటీ : రాష్ట్రంలో జగన్ ప్రభుత్వ హయాంలో 17 వైద్య కళాశాలలు నిర్మించడానికి కేంద్రం వాటాగా రూ.975కోట్లు ఇచ్చిందని, దాదాపు రూ.5వేల కోట్లను ప్రభుత్వం అప్పు చేసిందని, అయితే ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా వైద్య కళాశాలల పరిస్థితి ఉందని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) విమర్శించారు. అసలు ఆ నిధులు ఎటు మళ్లించారో జగన్ సమాధానం చెప్పాలని అయన డిమాండ్ చేశారు. స్థానిక జెఎన్ రోడ్డు సితార ఫంక్షన్‌హాల్లో సోమవారం ఉదయం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. జగన్ చెప్పినట్లు రాజమహేంద్రవరం మెడికల్ కాలేజీ చూసి ఆహా అనలేం కానీ, రెండు ప్రవేశ ద్వారాలతో నిర్మించుకున్న వైసిపి కార్యాలయాన్ని మాత్రం ఓహో అనగలమని ఎమ్మెల్యే వాసు ఎద్దేవా చేశారు. జగన్ హయాంలో రూ.1400 కోట్ల రూపాయలతో వైద్య కళాశాలల పనులు చేపట్టగా, అందులో కొన్ని పునాది దశలో మరికొన్ని పిల్లర్స్ దశలో ఉండగా , మరికొన్ని భూసేకరణ దశలోనే ఉన్నాయన్నారు. చేపట్టిన పనుల్లో కాంట్రాక్టర్లకు రూ. 670కోట్లు బకాయి పెట్టారని ఆయన వాపోయారు. మరి కేంద్రం ఇచ్చిన డబ్బులు, అప్పు తెచ్చిన సొమ్ములు ఏమయ్యాయని ఆయన నిలదీశారు. అప్పులు చేసి, రాష్ట్రాన్ని అస్తవ్యస్తం చేసింది చాలక దాన్ని సరిదిద్దడానికి కూటమి ప్రభుతం ప్రయత్నం చేస్తుంటే విమర్శలు చేయడం, దుష్ప్రచారం చేయడం దారుణమన్నారు. ప్రైవేటీకరణకు పీపీపీకి మధ్య వ్యత్యాసం తెలియని జగన్ ఐదేళ్లు సీఎంగా ఎలా పనిచేశారో అర్ధం కావడం లేదన్నారు. ఇప్పటికే గుజరాత్, రాజస్థాన్, కర్ణాటక తదితర అభివృద్ధి చెందిన రాష్ట్రాల్లో పీపీపీ విధానంలోనే వైద్య కళాశాలలు కొనసాగుతున్నాయన్నారు. పీపీపీ మెడికల్ కాలేజీల్లో కన్వీనర్ కోటా మెరిట్ సీట్లను కూటమి ప్రభుత్వం 42 నుంచి 50 శాతానికి పెంచిందని ఆయన గుర్తుచేశారు. ప్రజాస్వామ్యంలో ప్రజల మధ్య జగన్ ఉండటం శ్రేయస్కరం కాదని, రాష్ట్ర ప్రజల శ్రేయస్సు కోసం ఆయన జైలులో ఉండటమే మంచిదని ఎమ్మెల్యే వాసు వ్యాఖ్యానించారు. జగన్ తరహాలోనే ఆయన శిష్యులు ఫేక్ మాటలు మాట్లాడుతున్నారని, రోజురోజుకీ దిగజారిపోతున్నారని పరోక్షంగా మాజీ ఎంపీ మార్గాని భరత్ ని ప్రస్తావిస్తూ, ఆయన విమర్శించారు. మీడియా సమావేశంలో ఏపీ శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు, కూటమి నాయకులు కాశీ నవీన్ కుమార్, మజ్జి రాంబాబు, వై శ్రీనివాస్, వర్రే శ్రీనివాసరావు, నక్కా చిట్టిబాబు, రెడ్డి మణేశ్వరరావు, బుద్దిగ రాధా, ఉప్పులూరి జానకీ రామయ్య, బుద్దిగ రవి, కంటిపూడి రాజేంద్రప్రసాద్, కంటిపూడి శ్రీను, కొల్లి బుజ్జి, మొకమాటి సత్యనారాయణ, చాపల చిన్న రాజు, బందారు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

'స్వస్త్‌నారీ - సశక్త్ పరివార్ అభియాన్' వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర - తూర్పుగోదావరి : తూర్పుగోదావరి జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం ఉదయం 'స్వస్థ నారీ - సశక్త్ పరివార్ అభియాన్' కార్యక్రమం ప్రచార గోడ ప్రతులను జిల్లా రెవెన్యూ అధికారి టి. సీతారామ మూర్తి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి టి. సీతారామ మూర్తి మాట్లాడుతూ, తూర్పు గోదావరి జిల్లాలో సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 2 వరకు నిర్వహించబడే 'స్వస్థ నారీ - సశక్త్ పరివార్ అభియాన్' శిబిరాల ద్వారా వైద్య సేవలు అందించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా డీఎంహెచ్వో డా. కె. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ – రాష్ట్ర స్థాయి కార్యక్రమం విశాఖపట్నంలో జరుగనున్నదని, అందులో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి వై సత్య కుమార్ యాదవ్ పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో, సిపివో ఎల్ అప్పల కొండ, జిల్లా వ్యవసాయ అధికారి ఎస్ మాధవ రావు పాల్గొన్నారు.

వైసీపీ నేతల కేక్‌కటింగ్

విశాలాంధ్ర - రాజమండ్రి సిటీ : మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఆంధ్రరాష్ట్రంలో 17 మెడికల్ కాలేజీలు ప్రారంభించి నేటికీ రెండు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా సోమవారం స్థానిక మెడికల్ కాలేజీ దగ్గర మాజీ మంత్రివర్యులు తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షులు చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ ఆధ్వర్యంలో రాజంపేట నియోజవర్గ శాసనసభ్యులు ఆకేపాటి అమరనాథరెడ్డి, మాజీ శాసనసభ్యులు గడికోట శ్రీకాంత్‌రెడ్డి, కోరముట్ల శ్రీనివాసులు, జక్కంపూడి గణేష్‌లతో కలిసి రుడా మాజీ చైర్పర్సన్ శ్రీమతి మేడపాటి షర్మిళ రెడ్డి కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆరోగ్య సంరక్షణ బాధ్యత : ఎంపీపీ

విశాలాంధ్ర-దేవరపల్లి: మహిళలు పిల్లల ఆరోగ్యం పట్ల సంరక్షణ బాధ్యత స్వీకరించాలని దేవరపల్లి ఎంపీపీ కేవీకే దుర్గారావు పేర్కొన్నారు దేవరపల్లి మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం స్వస్థ నారి స్వశక్తి పరివార్ అభియాన్ ముందస్తు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు ఈ సందర్భంగా ఎంపీపీ దుర్గారావు మాట్లాడుతూ భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈనెల 17న మధ్యప్రదేశ్లో స్వస్తి నారి స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారని తెలిపారు. ఈ కార్యక్రమం 17 నుంచి అక్టోబర్ 2 వరకు భారతదేశమంతటా జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా తల్లులు తమ బిడ్డల ఆరోగ్య సౌరక్షణ బాధ్యత తీసుకోవలసి వస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవరపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ సంజీవ్ ఎంపీడీవో వై రాజారావు తాసిల్దార్ ఎం శ్రీనివాస్ ఎంఈఓ ఎం తిరుమల దాసు సచివాలయం కార్యదర్శులు మండల పరిషత్ సిబ్బంది దేవరపల్లి గౌరీపట్నం యాదవోలు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ పద్ధతులలో కూరగాయలు

విశాలాంధ్ర-దేవరపల్లి: ప్రతి ఇంటి వద్ద పెరట్లో ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ద్వారా కూరగాయలు ఆకుకూరలు పండించి ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు కొయ్యలమూడి చినబాబు సుధారాణి పేర్కొన్నారు. దేవరపల్లి మండలం పల్లంట్లలో సోమవార ప్రకృతి వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కిచెన్ గార్డెన్‌లో భాగంగా నిర్వహించిన ఆకుకూరలు కూరగా యలు ఉత్పత్తి కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు సుధారాణి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రకృతి వ్యవసాయంపై ప్రత్యేక దృష్టి పెట్టి ప్రోత్సహిస్తుందన్నారు. 200 కుటుంబాలకు సేవా కార్యక్రమం ద్వారా ఐదు వేల రూపాయలు ఆకుకూరలు కూరగాయలు పండించి గ్రామం మొత్తం ప్రకృతి వ్యవసాయం లో పండించిన ఉత్పత్తులు తినాలని కోరారు. ఈ సందర్భంగా ఆకుకూరలు కూరగాయలు విత్తనాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛంద సేవా సంస్థ షర్మిల యూనిటీ ఇంచార్జ్ రామలక్ష్మి డి ఎం ఎంప్టీ కృష్ణ ఐ సి ఆర్ పి ఎస్ పాక వెంకటలక్ష్మి తుర్లపాటి శృతి మెట్పల్లి నీరజ బండి దుర్గ ఎన్.ఎం.పి షాపు యజమాని బండి సురేష్ పల్లంట్ల గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు తాళ్లూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

రేపు మెగా గ్లోబల్ రక్తదాన శిబిరం

విశాలాంధ్ర - రాజమండ్రి సిటీ : ఈనెల 17న మెగా గ్లోబల్ రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు అఖిల భారతీయ తేరాపంత్ యువక్ పరిషత్ సభ్యులు తెలిపారు. సోమవారం మధ్యాహ్నం స్థానిక ప్రెస్ క్లబ్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రక్తదానం అన్ని దానాలలోకెల్లా అమూల్యమైనదని, ఒక్కరు రక్త దానం చేస్తే, ముగ్గురికి ప్రాణం పోయవచ్చని తెలిపారు. నేడు రక్త లేమికి గురై దేశ వ్యాప్తంగా వేలాది మంది తలసేమియా లాంటి అనేక ప్రాణాంక వ్యాధులతో బాధపడుతున్నారని, అలాంటి వారిని ఆదుకోవలసిన అవసరం ఉందన్నారు. తమ సంస్థ ద్వారా ఇప్పటికే అనేక రక్త దాన శిబిరాలను నిర్వహించామన్నారు. ఈనెల 17వ తేదీ నరేంద్రమోదీ 75వ జన్మ దినాన్ని పురస్కరించుకుని స్థానిక ఇస్కాన్‌రోడ్డులో ఉన్న బొమ్మన రామచంద్ర కళ్యాణ మండపంలో ఉదయం 9 గంటల నుంచి 5 గంటల వరకు మెగా గ్లోబల్ రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జైన్ సేవా సమితి, రాజస్థాన్ సేవా సమితి, మగ్న మదర్ అండ్ చైల్డ్ హాస్పటల్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ రక్త దాన శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు వారు తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు రక్త దానం చేసి ప్రాణదాతలు కావాలని వారు పిలుపునిచ్చారు.

శ్రీరంగ్ అప్పా బర్నె నర్సరీ సందర్శన

విశాలాంధ్ర - కడియం : తూర్పుగోదావరి జిల్లా, కడియం పల్ల వెంకన్న నర్సరీని మహారాష్ట్ర శివసేన పార్లమెంటరీ పార్టీ చీఫ్ విప్, సౌర విద్యుత్ కేంద్ర కమిటీ సభ్యులు, లోక్ సభ ఎంపీ. శ్రీరంగ్ అప్పా బర్నె సోమవారం సందర్శించారు. నర్సరీ చైర్మన్ పల్ల సత్యనారాయణమూర్తి, డైరెక్టర్లు పల్ల వెంకటేష్, వినయ్‌లు ఆయనకు పూలకుండీ ఇచ్చి స్వాగతం పలికారు. ఎంపీ బర్నే మాట్లాడుతూ నర్సరీ రంగంలో కడియం కు ఉన్న పేరు ప్రతిష్టలు విన్నానని, ఇప్పుడు స్వయంగా తిలకించడం ఆనందంగా ఉందన్నారు. పిఠాపురం పాదగయ సందర్శనకు వెళుతూ ఇలా నర్సరీల సందర్శనకు విచ్చేసినట్లు తెలిపారు. పల్ల వెంకన్న నర్సరీ అద్భుతంగా ఉందని ఎంపీ కితాబిచ్చారు. విశాల ప్రదేశంలో దేశీ, విదేశీ మొక్కలు కూర్పు ఎంతో ఆహ్లాదాన్ని ఇస్తున్నాయని తెలిపారు. నర్సరీ రైతులు సౌర విద్యుత్ వినియోగాన్ని ఉపయోగించుకుని ప్రయోజనం పొందాలని పిలుపునిచ్చారు. తాను సోలార్ విద్యుత్ పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సభ్యుడిగా కొనసాగుతున్నానని, ఈ ప్రాంతానికి అవసరమైన సేవలు అందిస్తానని ఆయన వెల్లడించారు. సోలార్ వినియోగానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సబ్సిడీలు అందిస్తున్నాయని నర్సరీ రైతులు ఆ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మోక్షగుండం విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి

విశాలాంధ్ర - నిడదవోలు : స్థానిక మోక్షగుండం విశ్వేశ్వరయ్య పేరుతో ఉన్న ఎం.వి నగర్ కాలనీకి విశ్వేశ్వరయ్య పేరుతో ముఖద్వారాన్ని, ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని మున్సిపల్ కమిషనర్ కు కెవిపిఎస్ నాయకులు జువ్వల రాంబాబు వినతి పత్రం అందజేశారు. భారతరత్న ప్రపంచ ప్రఖ్యాత ఇంజినీర్ అద్భుత మేధస్సు కలిగిన సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి సందర్భంగా జాతీయ ఇంజినీర్స్ డే పురస్కరించుకొని నిడదవోలు పట్టణంలో మొట్టమొదటి కాలని సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య నగర్‌కాలని అని దాని ముఖద్వారంలో మోక్ష గుండం విశ్వేశ్వరయ్య నగర్ పేరుతో ఆర్చి ఉండేదని కాలక్రమేణా ఆ ఆర్చి అదృశ్యం అయ్యిందని వినతి పత్రంలో తెలిపారు. ఆర్చినితిరిగి పునరుద్ధరించి, మోక్ష గుండం విశ్వేశ్వరయ్య విగ్రహాన్ని ఏర్పాటు చెయ్యాలని కోరుతూ మున్సిపల్ టీ కృష్ణవేణికి సిపిఎం తరపున జువ్వల రాంబాబు వినతి పత్రాన్ని అందజేశారు. అనుమతిస్తే విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు దాతలు సిద్ధంగా ఉన్నారని ఆ వినతి పత్రంలో తెలిపారు.

ఇంజనీర్స్ డే

విశాలాంధ్ర - ప్రత్తిపాడు : కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మినర్వా విద్యా సంస్థల్లో హిందీ దివాస్, ఇంజనీర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ హిందీ మన రాష్ట్ర భాష అని, మన భారతదేశం సర్వ మతాల సమ్మేళనమని వివరించారు. పిల్లలచే నిర్వహించబడిన సాంస్కృతి కార్యక్రమాలు మరియు డ్రాయింగ్ వేయించారు. అనంతరం హిందీ ఉపాధ్యాయులను సన్మానించారు. మోక్ష గుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మినర్వ విద్య సంస్థల ఉపాధ్యాయులుగపూర్, దేవి, శాలిని, విజయలక్ష్మి, త్రిమూర్తులు, రాజీవ్ పాల్గొన్నారు.

సమాజ అభివృద్ధిలో ఇంజనీర్లు పాత్ర కీలకం

విశాలాంధ్ర - రాజానగరం : సమాజ అభివృద్ధిలో ఇంజనీర్ల పాత్ర ఎంతో కీలకమని గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాలయం కులపతి కె.వి.వి.సత్యనారాయణ రాజు (చైతన్య రాజు) అన్నారు. భారతరత్న సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకుని మండలంలోని జిజియు ప్రాంగణంలో మేధా సాంకేతిక ఉత్సవాలను సోమవారం ఘనంగా ప్రారంభిం చారు. వేడుకలకు ముఖ్య అతిథిగా విచ్చేసిన కులపతి చైతన్య రాజు జ్యోతిప్రజ్వలన చేసి విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళు లర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సర్ మోక్ష గుండం విశ్వేశ్వరయ్య సేవలను స్మరించుకుంటూ ఏ సౌకర్యాలు లేని కాలంలో ఆయన చూపిన దూరదృష్టి దేశానికి అందించిన విశేష సేవలు నేటి యువ ఇంజనీర్లకు స్ఫూర్తిదాయకమన్నారు. కృత్రిమ మేధ (ఏఐ)మన జీవితాలలో అనేక అంశాలను మార్చగల సామర్థ్యం కలిగిఉందని,శాస్త్ర సాంకేతిక రంగాలలోని విప్లవాత్మక మార్పులను యువత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విశిష్ట అతిథిగా హాజరైన వర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ యు.చంద్రశేఖర్, ప్రో వైస్ ఛాన్సలర్ డాక్టర్ కె.వి.బి. రాజు విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. కార్యక్రమంలో మేధా కన్వీనర్ డాక్టర్ వి. సుబ్రహ్మణ్యం,డైరెక్టర్లు, డీన్స్, కళాశాలల ప్రిన్సిపల్స్, అధ్యాపక వర్గాలు, విద్యార్థులు పాల్గొన్నారు. ఆదికవి నన్నయలో తమ వర్సిటీ విద్యార్థులు ఆదికవి నన్నయ జ్ఞానం, మోక్షగుండం విశ్వేశ్వరయ్య శ్రద్ధ లను రెండింటి నుండి ప్రేరణ పొంది నూతన ఆవిష్కరణల దిశగా ముందుకు సాగాలని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య సత్తుపాటి ప్రసన్నశ్రీ అన్నారు. భారతరత్న సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి సందర్భంగా వర్సిటీ నందు అద్విక 25 ఇంజనీరింగ్ ఫెస్ట్ కార్యక్రమాన్ని యూనివర్సిటీ కన్వెన్షన్ సెంటర్ లో సోమవారం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా వీసీ ఆచార్య ఎస్ ప్రసన్నశ్రీ, ప్రిన్సిపాల్ డాక్టర్.పి.వెంకటేశ్వరరావు హాజరై జ్యోతిప్రజ్వలన చేసి నన్నయ విగ్రహానికి, మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ నైతికతతో నాణ్యత మరియు న్యాయానికి కట్టుబడి ఉన్న విశ్వేశ్వరయ్య మాదిరిగా బావి ఇంజనీర్లు తయారు కావాలన్నారు. ఇంజనీర్లు తమ మేధస్సుతో మానవాళికి గొప్ప సేవను చేయవచ్చునని, నన్నయ వారసత్వంతో నేర్చుకున్న విద్యను సమాజహితానికి ఉపయోగించాలని సూచించారు. కార్యక్రమంలో వర్సిటీ అధికారులు వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

వరద నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపండి

విశాలాంధ్ర - గోపాలపురం : కొవ్వాడ కాలువ, పిచ్చుక గండి వరద నీటి వల్ల ప్రతి ఏడాది రైతులు అంది వచ్చిన తమ పంటలను కోల్పోతున్నారని దీనికి శాశ్వత పరిష్కారం చూపించాలంటూ చెరుకుమిల్లి సొసైటీ అధ్యక్షులు గద్దె హరిబాబు, టీడీపీ రాష్ట్ర సాంస్కృతిక విభాగం అధికార ప్రతినిధి నూతంగి దొరబాబు ఆర్డీవో డాక్టర్ సుస్మిత రాణిని కోరారు. రెండురోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ఎగువ ప్రాంతమైన కొవ్వాడ, పిచ్చుక గండి ద్వారా వస్తున్న వరదనీటికి లోతట్టు ప్రాంతమైన చిట్యాల, వెంకటాయపాలెం గ్రామాలకు చెందిన సుమారు 900 ఎకరాలు నీట మునిగిన వరి, చెరకు ఇతర పంట పొలాలను ఆర్డీవో డాక్టర్ సుస్మిత రాణి పరిశీలించారు. ఈ సందర్భంగా నీట మునిగిన పంట పొలాల రైతులు నాయకులు ఆర్డీవోతో మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా తమ ప్రాంత పంట పొలాలు ప్రతి ఏడాది వరద ముంపునకు గురై నష్టపోతున్నామని తమ ఆవేదన వ్యక్తం చేశారు. ఇన్పుట్ సబ్సిడీ కంటే తమ పంటల పరిరక్షణకు శాశ్వత పరిష్కారం చూపించాలని ఆమెను కోరారు. కొవ్వాడ రిజర్వాయర్ నుండి పిచ్చుక గండి ద్వారా వచ్చే నీటిని పోలవరం కుడి కాలువ లోనికి మళ్లిస్తే తమ పంటలకు న్యాయం చేకూర్చినట్టు ఉంటుందని దీనిపై ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట రాజుదృష్టికి తీసుకొని వెళ్లగా దీనిపై సమగ్ర నివేదిక తయారుచేసి ఉన్నతాధికారులతో మాట్లాడి శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తామన్నారని ఆర్డిఓ సుస్మితరానికి తెలిపారు. ఈ సందర్భంగా ఆర్డీవో సుస్మితరాణి మాట్లాడుతూ ప్రభుత్వానికి నివేదించి రైతులకు న్యాయం జరిగేటట్లు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో కొవ్వూరు వ్యవసాయ డివిజనల్ అధికారి చింతల శ్రీనివాస్, వ్యవసాయ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

ఏలేరు నీరు , ఆధునీకరణ పనులపై ప్రజాప్రతినిధుల ధ్వజం

విశాలాంధ్ర - పెద్దాపురం : ఏలేరు నీటి విడుదల, ఆధునీకరణ పనుల్లో అధికారులకు స్పష్టత లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని ప్రజా ప్రతినిధులు మండిపడ్డారు. గృహ నిర్మాణాల్లోనూ ఆయా శాఖాధికారుల వైఫల్యం స్పష్టంగా కనపడుతుందంటూ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. పెద్దాపురం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం సోమవారం ఎంపీపీ వెంకే సత్యవతి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా మల్లావ, తిరుపతి గ్రామ సర్పంచు తోట రామకృష్ణ, మెదళ్ల కృష్ణమూర్తి మాట్లాడుతూ మండల సమావేశానికి పూర్తి స్థాయిలో అధికారులు హాజరుకాక పోవడమేమిటని ప్రశ్నించారు. సమావేశానికి హాజరుకానీ అధికారులకు నోటీసులు జారీ చేయ్యాలన్నారు. గృహ నిర్మాణ శాఖ. ఇరిగేషన్ అధికారులు తమ శాఖల తీరుపై స్పష్టత కల్గి ఉండాలని, ప్రజలకు మెరుగైన సేవలందించాలన్నారు. పంచాయతీ రాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, ఎన్ఆర్ఆస్ఈజీఎస్ నుంచి రావాల్సిన బిల్లులను సత్వరమే విడుదల చెయ్యాలన్నారు. కొండపల్లి ఎంపీటీసీ పోకనాటి నాగలక్ష్మి మాట్లాడుతూ మెట్టలోని పామాయిల్ చైతాంగానికి ఇవ్వాల్సిన సబ్సిడి నకాలంలో విడుదల చెయ్యడంలో లేదన్నారు. రైతులకు ఇవ్వాల్సిన బకాయిలు చెల్లించేందుకు అధికారులు కృషి చెయ్యాలన్నారు. అనంతరం పలు సమస్యలపై అధికారులు, ప్రజాప్రతినిధుల మధ్య తీవ్ర చర్చ కొనసాగింది. ఈ సందర్భంగా సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే నిమ్మకాయల చిన రాజప్ప మాట్లాడుతూ అధికారులు, ప్రజా ప్రతినిధుల సమిష్టి కృషితోనే మండల అభివృద్ధి సాధ్యపడుతుందన్నారు. కోట్లరూపాయలు గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి రోడ్లు, డ్రెయిన్లు, కల్వర్టులు, పలు అభివృద్ధి పనులకు కేటాయించడం జరుగుతుందన్నారు. గ్రామాల్లో మంచి అభివృద్ధి పనులు చేపట్టాలంటూ అధికారులు. ప్రజా ప్రతినిధుల మధ్య సమన్వయం ఎంతో అవసరమన్నారు. ఏడాది కాలంలో సుమారు రూ.100 కోట్ల అభివృద్ధి పనులు చేపట్టమన్నారు. ప్రతీ గ్రామానికి అవసరమైన రోడ్లు ప్రస్తుత ప్రభుత్వ హయాంలో చేపట్టమన్నారు. అభివృద్ధికి ప్రతీ ఒక్కరి సహకారం ఎంతో అవసరమని ఎమ్మెల్యే చిన రాజప్ప అన్నారు. అనంతరం డిఎల్డీఓగా పదోన్నతిపై విశాఖ జిల్లాకు వెళ్లుతున్న ఎంపీడీఓ శ్రీలలితను ఎమ్మెల్యే నిమ్మకాయల చిన రాజప్ప.' డీసీసీబీ చైర్మన్ తుమ్మల బాబు, మండల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు ఘనంగా సత్కరించారు. మార్కెట్ కమిటీ లైర్మన్ నూనె మంగాలక్ష్మి, సర్పంచ్లు కనపర్తి చీమదొర. శ్రీనివాస్, శేఖర్, ఎంపీటీసీలు నల్లల సూర్యకుమారి, నాగలక్ష్మి, మండల కో-ఆప్షన్ సభ్యులు శేషకుమారి, ఆయాశాఖల అధికారులు. ఆయా గ్రామాల ఎంపీటీసీలు, సర్పంచ్లు పాల్గొన్నారు.

ఘనంగా మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి

విశాలాంధ్ర - రాజమహేంద్రవరం రూరల్ : మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి వేడుకలను పురస్కరించుకొని సోమవారం ధవళేశ్వరం ఇరిగేషన్ కార్యాలయం ఆవరణలో అధికారులు ఘనంగా నివాళు లర్పించారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఆయనను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా ఎస్.ఇ. కె. గోపీనాథ్ మాట్లాడుతూ, మహానీయుడు విశ్వేశ్వరయ్య దేశ అభివృద్ధిలోనే కాకుండా ఇరిగేషన్ రంగంలో విశిష్టమైన కృషి చేశారని పేర్కొన్నారు. కృష్ణరాజసాగర డ్యాం నిర్మాణంలో తన ప్రతిభను ప్రదర్శించి నీటి పారుదల ప్రాజెక్టుల ప్రాధాన్యతను చాటడమే కాకుండా, ఆటోమేటిక్ స్లూయిస్ గేట్ల రూపకల్పనలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగించి వ్యవసాయానికి అనుకూలంగా నీటి నియంత్రణ సాధ్యమయ్యేలా ఆయన కృషి చేసినట్లు పేర్కొన్నారు.

పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు

విశాలాంధ్ర - సీతానగరం: రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టబోయే "గాలి కుంటు వ్యాధి నివారణ" చర్యల్లో భాగంగా మండల వ్యాప్తంగా అన్ని గ్రామాలలో పాడి రైతుల ఇంటి వద్దే టీకాల కార్యక్రమం నిర్వహించడం జరుగుతుంది అని పశువైద్య అధికారి డాక్టర్ ఫణీంద్ర అన్నారు. ఈపశువైద్య అధికారి విలేకరులతో మాట్లాడుతూ పాడి రైతులు తప్పనిసరిగా తమ పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు వేయించాలని కోరారు. ఈ టీకాలు సెప్టెంబర్ 15 నుంచి అక్టోబర్ 15 వరకు పశువులకు మీ గ్రామంలో ఉన్న పశు వైద్య సిబ్బంది మీ ఇంటి వద్ద గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలు వేస్తారన్నారు. కొంత మంది పాడి రైతులు టీకాలు వేయించడం విముఖత చూపడం వలన పాలు ఇచ్చే పశువులలో పాల దిగుబడి 30 నుంచి 50 శాతం తగ్గిపోవడంతో పాటు కొన్ని సార్లు మరణాలు సంభవించడం కూడా జరుగుతుందన్నారు. సెప్టెంబర్ 15,16 కూనవరం, ఉండేశ్వరపురం, 17,18 చినకొండేపూడి, ముగ్గళ్ళ, మిర్తిపాడు, 19,20 నాగమపల్లి, ముగ్గళ్ళ, కాటవరం, 22,23,24 సీతానగరం, ఐ జీ పేట, బొబ్బిల్లంక, 25,26,27 వంగలపూడి, వెద్దుళ్లపల్లి, మునికూడలి, ముల్లకల్లంక, 29 నల్గొండ, అక్టోబర్ 3,4,5 పురుషోత్తపట్నం, 7,8,9 సింగవరం, 10 నుంచి 14 రఘుదేవపురం గ్రామాల్లో టీకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఏఎంసీ చైర్మన్‌కు టీడీపీ నాయకుల శుభాకాంక్షలు

విశాలాంధ్ర - మామిడికుదురు : తాటిపాక వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నియమితులైన కేతా వెంకటలక్ష్మి శ్రీనివాస్‌ను మామిడికుదురు మండల టీడీపీ నాయకులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆమెకి శాలువాకప్పి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు పొందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నయినాల సత్యనారాయణ, మామిడికుదురు టిడిపి మండల కమిటీ ఉపాధ్యక్షుడు ఉండ్రు రామారావు, మానేపల్లి వాటర్ యూజర్స్ అసోసియేషన్ మాజీ డైరెక్టర్ బందారు వెంకటేశ్వరరావు, అప్పనపల్లి శ్రీ బాల బాలాజీ దేవస్థానం ధర్మకర్తల మండలి మాజీ సభ్యులు వాసంశెట్టి వెంకట్రావు, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా తెలుగు యువత మాజీ అధికార ప్రతినిధి మెండా వెంకటేశ్వరరావు, టిడిపి గ్రామ కమిటీ, మాజీ ప్రధాన కార్యదర్శి యింటి రామ నాగ వెంకట గణపతిరావు, మండేల వీరేంద్ర, పెచ్చెటి సత్యనారాయణ పాల్గొన్నారు.

గురువులు భవిష్యత్ తరాలకు మార్గదర్శకులు ఎమ్మెల్యే నానాజీ

విశాలాంధ్ర - కరప : గురువులు భవిష్యత్ తరాలకు ఒక మార్గదర్శకులుగా తమ అమూల్యమైన సేవలను అందిస్తున్నారని కాకినాడ రూరల్ శాసనసభ్యులు పంతం నానాజీ పేర్కొన్నారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుని దేవి సునంద కుమారి, ఉపాధ్యాయులకు సోమవారం ఘనంగా సత్కరించారు. కరప మండల విద్యాశాఖ అధికారిని కెబి కృష్ణవేణి అధ్యక్షతన గురుపూజోత్సవాన్ని ఘనంగా నిర్వహించగా ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. కాకినాడ రూరల్ నియోజకవర్గంలో 34 మోడల్ స్కూల్స్ మూడు హైస్కూల్స్ ఇవ్వడం జరిగిందని విద్యతోనే సమాజం, దేశం, అభివృద్ధి చెందుతాయని ఎమ్మెల్యే అన్నారు. ఈ కార్యక్ర మంలో భోగిరెడ్డి కొండబాబు, సొసైటీ అధ్యక్షులు భవాని శంకర్, మార్కెట్ కమిటీ చైర్మన్ ముద్రగడ రమేష్, వేములవాడ సొసైటీ అధ్యక్షుడు దూడల నారాయుడు, భోగి రెడ్డి గంగాధర్, జోగ అప్పలరాజు, మెండు గోవిందు, ఎంఈఓ2 పి సత్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'విజయవంతంగా ఆదిత్య పోలీ వేద -2కె25'

విశాలాంధ్ర - గండేపల్లి : గండేపల్లి మండలం, సూరంపాలెం ఆదిత్య విద్యా ప్రాంగణంలో గల ఆదిత్య పాలిటెక్నిక్ కళాశాల నిర్వహించే 'వేద-2కె25' పేరిట నిర్వహించిన జాతీయ స్థాయి టెక్ ఫెస్ట్‌ను 15 సోమవారం భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య జన్మదినం సందర్భంగా జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభమ య్యాయి. సదస్సుకు ప్రిన్సిపాల్ కుమార్ అధ్యక్షత వహించగా ముఖ్య అతిథులుగా కాకినాడ రీజినల్ జాయింట్ డైరెక్టర్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ జివి రామచంద్రరావు, ఆదిత్య యూనివర్సిటీ ప్రో ఛాన్సలర్ డా ఎన్ సతీష్ రెడ్డి, డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డా ఎం శ్రీనివాసరెడ్డి పాల్గొనగా గౌరవ అతిథులుగా వి శ్రీకాంత్‌రెడ్డి, అసిస్టెంట్ జనరల్ మేనేజర్, జువారి సిమెంట్ మిటెడ్, ఎస్ నవీన్ చీఫ్ మేనేజర్, పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ఇంజనీరింగ్ విద్యార్థులకు ధీటుగా పాలిటెక్నిక్ విద్యార్థుల ప్రాజెక్టులు, పేపర్ ప్రెజెంటేషన్‌లు ఎంతో సృజనతో విజ్ఞాన దాయకంగా ఉన్నాయని ఇటువంటి కార్యక్రమాలలో విద్యార్థులు పాల్గొనడం ద్వారా వివిధ రకాల విద్యార్థుల సృజనాత్మక ఆలోచనల మేళవింపుతో నూతన ఆవిష్కరణలకు దోహద పడతాయని వేద వంటి కార్యక్రమాలు విద్యార్థులలో పోటీ తత్వాన్ని పెంపొందించడానికి ఎంతో దోహద పడతాయని అన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన పలు కార్యక్రమాలు ఎంతో విజ్ఞానదాయకంగా జరి గాయి. ఈ కార్యక్రమం డీన్ ఎవి మాధవరావు, అసోసియేట్ డీన్ పొన్నాడ శ్రీనివాస్, వివిధ విభాగాధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అర్జీలు సత్వరమే పరిష్కరించాలి

విశాలాంధ్ర - కాకినాడ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రతి సోమవారం నిర్వహిస్తున్న పీజీఆర్ఎస్ కార్యక్రమం సోమవారం కాకినాడ కలెక్టరేట్ వివేకానంద హాలులో జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జె వెంకటరావు, జేడీపీ సీఈవో లక్ష్మణరావు, బీసీ కార్పొరేషన్ ఈడీ ఎ శ్రీనివాసు, డీపీవో వి రవికుమార్, ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్లు జి రత్నమణి, ఎన్ శ్రీధర్ తదితర అధికారులు హాజరై ప్రజల నుంచి దరఖాస్తులను, అర్జీలను స్వీకరించారు. ఈ అర్జీలను ఆయా శాఖల అధికారులకు సూచిస్తూ వాటిపై సత్వరం సమగ్రమైన విచారణ చేపట్టి తగిన పరిష్కారం అందించాలని అధికారులను ఆదేశించారు. బియ్యం కార్డు మంజూరు, కార్డులోని పేర్లు మార్పులు చేర్పులు, పింఛన్లు, ఉద్యోగ ఉపాధి అవకాశాలు, ఇళ్ల స్థలాలు, భూమి వివరాలు ఆన్ లైన్లో నమోదు, రీ సర్వే, ఆక్రమణలు తొలగింపు, డ్రైన్, కాలువల్లో పూడిక తొలగింపు, పారిశుద్ధ్యం, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ ఆన్ లైన్ సమస్యలు వంటి అంశాలకు చెందిన మొత్తం-434 అర్జీలు అందాయి. ఈ సందర్భంగా

ఆయన మాట్లాడుతూ..పీజీఆర్ఎస్ కార్యక్రమంలో అందిన దరఖాస్తులు, అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి నాణ్యమైన పరిష్కారం ఇవ్వాలన్నారు. జిల్లా స్థాయి అధికారి ఆడిట్ చేసి నివేదిక పంపించిన తర్వాత వాటిని రాష్ట్రస్థాయిలో ఆడిట్‌కి పంపించడం జరుగుతుందని ఆయన తెలిపారు. అర్జీదార్లు తమ యొక్క అర్జీల నమోదు, అర్జీల ప్రస్తుత స్థితికి సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి టోల్ ఫ్రీ నెంబర్ 1100 (డబల్ వన్ డబల్ జీరో)కి నేరుగా కాల్ చేయవచ్చని ఆయన తెలిపారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు కలెక్టరేట్ విభాగాల అధిపతులు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో జేసీ రాహుల్ మీనా

విశాలాంధ్ర - కాకినాడ : కలెక్టర్ల కాన్ఫరెన్స్ వీసీకి కాకినాడ జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా హాజరయ్యారు. రాష్ట్ర రాజధాని అమరావతిలో రాష్ట్ర ప్రభుత్వం సోమవారం నుంచి రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న 4వ కలెక్టర్ల కాన్ఫరెన్స్‌కు సోమవారం కాకినాడ కలెక్టరేట్ నుంచి ఆయన..ట్రైనీ కలెక్టర్ మనీషాతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జిల్లాలో రాష్ట్ర ప్రభుత్వ ప్రాధాన్య కార్యక్రమాల అమలు

తీరును సమీక్షించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలపై అన్ని జిల్లాల కలెక్టర్లకు దిశా నిర్దేశనం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో సీపీవో పీ త్రినాథ్, ఏపీఎంఎస్ఐడిసి ఈఈ సీహెచ్ రత్నరాజు, ఏడి సర్వే కె శ్రీనివాసు ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి పేదలకు వరం : చినరాజప్ప

విశాలాంధ్ర - కాకినాడ : 'అభాగ్యుల జీవితాల్లో కాంతిరేఖలా సీఎం సహాయనిధి పేదలకు ఎంతో ఉపయోగపడుతోంది. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ముఖ్యమంత్రి చంద్రబాబు సారథ్యంలో కూటమి ప్రభుత్వం పేదల మేలు కోసం కృషి చేస్తుందని మాజీ మంత్రి పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. సోమవారం సామర్లకోట మండలం కొప్పవరం గ్రామంలో రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు క్యాంప్ కార్యాలయంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే రాజప్ప పాల్గొని లబ్దిదారులకు చెక్కులు అందజేశారు. కాకినాడ జిల్లాలోని పలు నియోజకవర్గాలకు చెందిన 5 మంది లబ్దిదారులకు రూ.7, లక్షల 95, వేల 350 సహాయం అందించారు. ఎమ్మెల్యే రాజప్ప మాట్లాడుతూ వైద్య ఖర్చులు భరించలేని పేదలకు సీఎం సహాయనిధి భరోసా కలిగిస్తుందని ఎమ్మెల్యే రాజప్ప తెలిపారు. ప్రజల అర్జీలు స్వీకరించి వాటిని ముఖ్య మంత్రివరకు తీసుకెళ్తూ సహకారం అందిస్తున్నందుకు

రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు కృషిను ఆయన కొనియాడారు. కార్యాలయ ఇన్‌చార్జ్ మేకా లక్ష్మణమూర్తి మాట్లాడుతూ-'కూటమి ప్రభుత్వం వైద్య విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తోంది. దరఖాస్తులు పంపిన వారం రోజుల్లోనే సహాయనిధి చెక్కులు రావడం లబ్దిదారుల్లో సంతోషాన్ని కలిగించిందన్నారు. ఒక చిన్నారి వైద్యం నిమిత్తం 80వేల ఎల్వోసీ అర్జీ చేసుకున్న 24 గంటలలో అందించడం జరిగిందన్నారు. లబ్దిదారులు ముఖ్యమంత్రి, రాజ్యసభ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ జడ్పీ ప్రతిపక్ష నేత తోట నవీన్, మాజీ డిప్యూటీ మేయర్ అరిగెల శ్రీనివాసరావు (బున్నీ), చింతపల్లి అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యలపై పోరాడతాం

విశాలాంధ్ర - ఏలేశ్వరం : ప్రభుత్వాలు మారిన మారని ఉపాధ్యాయ సమస్యలు పరిష్కారానికి ఈనెల 18 నుండి జరగనున్న శాసన మండలి సమావేశంలో చర్చిస్తామని ఉభయగోదావరి జిల్లాల పిడిఎఫ్ ఎమ్మెల్సీ బొర్రా గోపి మూర్తి అన్నారు. ఈ నెల 15 నుంచి 19 వరకు జరిగే యూటీఎఫ్ రణభేరి కాకినాడ జిల్లా ప్రచార జాత ఏలేశ్వరంలో సోమవారం రాత్రి ముగిసింది. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉపాధ్యాయులపై అదనపు భారం మరింత పెరిగిందని అన్నారు. ప్రభుత్వం 15 నెలల గడుస్తున్నా పిఆర్‌సి ప్రసక్తే లేదన్నారు. వేలాది కోట్లకు పెరిగిపోయిన డిఏ బకాయిలను వెంటనే చెల్లించాలని, పిఆర్‌సి వేసి అమలు చేయాలని, సిపిఎస్ రద్దు చేయాలని, విద్యానిరంగ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని, ఉపాధ్యాయులు కేవలం బోధన మాత్రమే చేసేలా వాతావరణం కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి సమస్యలు పరిష్కరించకపోతే ఈ నెల 25న వేలాది మందితో విజయవాడలో మహా నిరసన కార్యక్రమం చేపడతామన్నారు.



ఈ కార్యక్రమంలో పిటిఎఫ్ రాష్ట్ర నాయకులు టి రవి చక్రవర్తి, కె శ్రీదేవి, బి సుభాషిణి జిల్లా కార్యదర్శి సిహెచ్ సూరిబాబు, కెవివి గణేష్, పీవీ సత్యనారాయణ, రాష్ట్ర పూర్వపు కార్యదర్శి ప్రభాకర్ వర్మ, ఏలేశ్వరం మండల యూటీఎఫ్ నాయకులు జె సోమరాజు, కే రవి, ఎస్ రాజశేఖర్, బి రాంబాబు, జై అప్పారావు, ఎంవివి గిరీశ్వర రావు, టి శ్రీనివాసరావు, పి గణపతి రావు దొర, బి వెంకన్న బాబు, సిహెచ్ గణపతి రెడ్డి, టి మురళి, పి సుబ్బారావు, ఓ రాజు ఉన్నారు.

మండల అభివృద్ధికి సహకరించాలి : ఎంపీడీవో

విశాలాంధ్ర - యు కొత్తపల్లి : మండల అభివృద్ధికి ప్రజా ప్రతినిధులు, మండల స్థాయి అధికారులు సహకరించాలని ఎంపీడీవో లక్ష్మీ రెడ్డి అన్నారు. కొత్తపల్లి మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపీపీ కారే సుధా ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మండలంలోని అనేక గ్రామాల్లో ఉన్న సమస్యలపై ప్రజా ప్రతినిధులు అధికారులను నిలదీశారు. గ్రామాల్లో సంవత్సరాల తరబడి ఉన్న సమస్యలను పరిష్కరించాలని వారు కోరారు. వివిధ శాఖ అధికారులు తమ ప్రగతి నివేదికను తెలియపరిచారు. రైతులు యూరియా సమస్యతో ఇబ్బంది పడుతున్నారని దీనిపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని వైస్ ఎంపీపీ శెట్టి బత్తిన సురేష్ కుమార్ కోరారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి గుబ్బల తులసి కుమార్, వైస్ ఎంపీపీ మాదిరెడ్డి దొరబాబు, తహసీల్దార్ చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఇంజనీర్స్ డే వేడుకలు

విశాలాంధ్ర - అమలాపురం : స్థానిక పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ డిపార్ట్మెంట్ ఆవరణలో మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకొని ఆయన విగ్రహానికి పులి రామకృష్ణ రెడ్డి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లకు మేమెంటోలు ఇచ్చి అభినందించారు. రిటైర్డ్ ఇంజనీర్స్ సిహెచ్ రామకృష్ణ తదితరులను సన్మానించారు. ఇంజనీర్స్‌గా కెరీర్‌లో కోనసీమలో ప్రతిష్టాత్మక వంతెనలు రోడ్స్ నిర్మాణంకు విశ్వేశ్వరయ్య స్ఫూర్తి అని రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ అన్యం రాంబాబు తెలిపారు. డిఈ పీవీఎస్ రాజకుమార్ మాట్లాడుతూ ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లకు అవార్డ్స్ ఇవ్వడం వారిలో పోటీతత్వం పెరుగుతుందన్నారు. ఈఈ మాట్లాడుతూ నిస్వా ర్థంగా మోక్షగుండం వారిని ఆదర్శంగా తీసుకోవా లన్నారు. సుమారు 120 మంది జిల్లా పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ సిబ్బంది పాల్గొని జయప్రదం చేసారు. డిప్యై ఇఇ శ్రీనివాస్, కొండల్‌రావు, సత్యనారాయణ, సంపన్న, సంధ్య పాల్గొన్నారు.

రాజుకు జాతీయ సేవా రత్న అవార్డు

విశాలాంధ్ర - కరప : మదర్ సర్వీస్ సొసైటీ మూడో వార్షికోత్సవం సందర్భంగా విజయవాడ గాంధీనగర్‌లో అక్కినేని నాగేశ్వరరావు ఆడిటోరియంలో జరిగిన నేషనల్ అవార్డ్స్ ప్రధానోత్సవంలో భాగంలో కాకినాడ జిల్లా కరప మండలం గురజానపల్లి గ్రామం మానవత్వం స్వచ్ఛంద సేవా సంస్థ ఇస్తున్న సేవా కార్యక్రమాలకు గుర్తింపుగా మానవత్వం వ్యవస్థాపకుడు జొన్నలగడ్డ రాజుకు జాతీయ సేవారత్న అవార్డుతో సభాముఖంగా సినీ ప్రముఖులు సీనియర్ ఆర్టిస్ట్ అండ్ కమెడియన్ పృథ్వీరాజ్, హీరోయిన్ కుమారి రంజిత షిండే చేతులు మీదుగా సత్కరించడం జరిగింది. అవార్డు రావడంపై మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు తదితరులు అభినందించారు.

సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలి

విశాలాంధ్ర – కాకినాడ : డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థకు వచ్చే సమస్యల అర్జీల పరిష్కారానికి సత్వరం చొరవ చూపాలని కాకినాడ నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ కేటీ సుధాకర్ నగరపాలక సంస్థ అధికారులను ఆదేశించారు. సోమవారం కాకినాడ నగరపాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించిన డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమానికి ఏడు గురు ఫోన్ ద్వారా తమ సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలో అదనపు కమిషనర్ కేటీ సుధాకర్ పాల్గొని నేరుగా ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వారి సమస్యలను స్వయంగా విని పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులకు సూచించారు. 13కి పైగా సమస్యలపై అర్జీలు అందాయి. వాటిపై అదనపు కమిషనర్ సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ పి వెంకట్రావు, డిసిపి కృష్ణారావు, ఎంహెచ్ఓ డాక్టర్ పృథ్వీచరణ్, టీపీఆర్వో శైలజ, ఈఈలు కామేశ్వరరావు, మాచిరాజు, ఏసీపీ శ్రీధర్, మేనేజర్ సీతారాం, అకౌంటెంట్ రామశాస్త్రి, ఆర్వో సిరీస్ పాల్గొన్నారు.

అర్జీల పరిష్కారంలో స్పష్టత ఉండాలి : జేసీ

విశాలాంధ్ర – అమలాపురం : అర్జీల పరిష్కారంలో ఖచ్చితమైన స్పష్టత ఉండాలని అర్జీలు పునరావృతమైతే సంబంధితజిల్లా స్థాయి అధికారులు పూర్తి భాధ్యత వహించాలని జిల్లా జాయిం ట్ కలెక్టర్ టి నిషాంతి సూచించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్లోని గోదావరి భవన్ నందు నిర్వహించిన జిల్లాస్థాయి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని జాయింట్ కలెక్టర్ అధ్యక్షత న నిర్వహించి సుమారుగా 260 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అర్జీదారుల సమస్యల పరిష్కారంలో స్పష్టత తప్పని సరని అర్జీలు పునరావృతమైతే జిల్లా అధికారులు భాధ్యత వహించాల్సి వస్తుందని ఆమె అధికారులను ఆదేశించారు. ఈ సంద ర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలకు అత్యంత చేరువుగా సుపరిపాలనను అందించాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా ప్రజల సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించడానికి అధిక ప్రాధాన్యతను ఇస్తుందని ప్రజల నుండి స్వీకరించిన అర్జీలకు పరిష్కారం చూపడంలో జిల్లా అధికారులు ప్రత్యేక చొరవ చూపాల్సిన అవసరం ఉందన్నారు. అధికారులు వారి వారి శాఖలకు సంబంధించిన అర్జీలను క్షణంగా పరిశీలించి తమ సిబ్బందితో నిర్ణీత గడువులోగా పరిష్కార చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈకార్యక్రమంలో డ్వామా పిడి మధుసూదన్ సమగ్ర శిక్ష ఏపీసి జి మమ్మీ, ఎస్టిసి పి కృష్ణమూర్తి, డిఎల్డిఓ వేణుగోపాల్ వివిధ శాఖ జిల్లా అధికారులు, జిల్లా కలెక్టరేటు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా ప్రజా పంపిణీ వ్యవస్థ : జేసీ

ప్రజా పంపిణీ వ్యవస్థలో అక్రమాలకు తావులేకుండా పారదర్శకతకు పెద్దపీట వేస్తూ, పేదలకు అన్ని అవసరాలకు ఉపయోగ పడే విధంగా బియ్యం కార్డుల స్థానంలో క్యూఆర్ కోడ్ ఆధారిత స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేస్తున్నట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ టి నిశాంతి తెలిపారు. సోమవారం స్థానిక మహిపాల వీధి సమతా నగర్ 9, 10 వార్డులలో సుమారు 376 మందికి స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పారదర్శ కతతో రేషన్ సరుకులు పంపిణీ చేసేందుకు వీలుగా క్యూఆర్ కోడ్ ఆధారిత డైనమిక్కీ రిజిస్ట్రార్తో వీటిని అనుసంధానం చేశారన్నారు. రేషన్ పంపిణీలో అక్రమాలను అరికట్టవచ్చని వీటిని ఐడెంటిటీ కార్డుల కింద వినియోగించు కోవచ్చన్నారు. స్మార్ట్ ఈ- పోస్ మిషన్లను ప్రభుత్వం అందుబాటులోకి తేనుందని, ఇప్పుడిస్తున్న స్మార్ట్ కార్డులను ఈ యంత్రం ద్వారా స్వైప్ చేస్తే కార్డుదారుడి వివరాలు వస్తాయన్నారు. సిమ్, వైఫై, హాట్స్పాట్, బ్లూ టూత్, టచ్ స్క్రీన్ వంటి ఆధునిక సదుపాయాలతో, ఆండ్రా యిడ్ సాంకేతికతతో పని చేస్తుందన్నారు. వేలిముద్ర పడకున్నా యంత్రంలో కెమెరా ద్వారా ఐరిస్ స్కాన్ చేయవచ్చన్నారు. తాజా పరిణామాలతో రేషన్ పంపిణీ వ్యవస్థ నూతన సాంకేతిక మార్పులతో అత్యంత పకడ్బందీగా మారనుందన్నారు. ప్రభుత్వం ఏర్పడిన దగ్గర్నుంచి ప్రజల కోసం ఎన్నో పథ కాలను తీసుకొచ్చి సంక్షేమం కోసం కృషి చేస్తుందన్నారు. మొట్టమొదటి సీఎం చంద్రబాబునాయుడన్నారు. రేషన్, సరుకుల పంపిణీలో అక్రమాలకు చెక్ పెడుతూ, రేషన్ వ్యవస్థను ప్రక్షాళన చేసేలా లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ కే మాధవి, డీఎస్ఓ ఉదయభాస్కర్, నాయకులు మెట్ల రమణబాబు నియోజకవర్గ ప్రత్యేక అధికారి డి రాంబాబు, మున్సిపల్ కమిషనర్ నిర్మల్ కుమార్ తాసిల్దార్ అశోక్ ప్రసాద్, వార్డ్ కౌన్సిలర్లు దుర్గాబాయి, విజయలక్ష్మి, హస్తకళల కార్పొరేషన్ చైర్మన్ ఆర్ఎస్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రిని మర్యాద పూర్వకంగా కలిసిన కలెక్టర్

విశాలాంధ్ర – తూర్పుగోదావరి : తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం తొలిసారిగా కలెక్టర్ కీర్తి చేకూరి రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ను సోమవారం విజయవాడలోని క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లాలోని పలు అంశాలపై సమగ్రంగా చర్చ జరిగింది. ముఖ్యంగా పర్యాటక అభివృద్ధి, సాంస్కృతిక కార్యక్రమాల ప్రోత్సాహం, సినీ రంగానికి అనుబంధ మౌలిక వసతులు, జిల్లా సమగ్రాభివృద్ధికి సంబంధించిన ప్రాధాన్య అంశాలు చర్చకు వచ్చాయి. మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ తూర్పుగోదావరి జిల్లా రాష్ట్రానికి ప్రత్యేక గుర్తింపు కలిగిన ప్రాంతమని, దీనిని మరింతగా అభివృద్ధి పరచడానికి కలెక్టర్ కృషి చేయాలని సూచించారు. రాబోయే కలెక్టర్ల కాన్ఫరెన్స్లో జిల్లా అభివృద్ధి అంశాలపై సమగ్ర ప్రజెంటేషన్ సిద్ధం చేసి సమర్పించాలని ఆయన ఆదేశించారు. మంత్రి సూచనల మేరకు అన్ని శాఖలతో సమన్వయం కలిగి, అభివృద్ధి ప్రాధాన్యతా రంగాలలో తక్షణ చర్యలు చేపడతామని కలెక్టర్ కీర్తి చేకూరి హామీ ఇచ్చారు.

అమోనియా లీక్ కార్మికుడు మృతి

విశాలాంధ్ర – రావులపాలెం : అవంతి ఫ్రోజెన్ ఫుడ్స్ కంపెనీలో జరిగిన అమోనియా లీక్ ఘటనలో ఒక కార్మికుడు ప్రాణాలు కోల్పోయిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానిక రావులపాలెం ఎస్ఐ చంటి తెలిపిన వివరాల ప్రకారం, గోపాలపురం గ్రామానికి చెందిన మైగాపుల కొండే శ్వరరావు (47) ఆ ఫ్యాక్టరీలో మిషన్ ఆపరేటర్గా పని చేస్తున్నారు. సెప్టెంబర్ 10ఉదయం 9 గంటల సమయంలో విధుల్లో ఉండగా అమోనియా గ్యాస్ లీక్ కావడంతో కొండేశ్వరరావు అస్వస్థతకు గురయ్యారు. తక్షణమే వైద్యుల సూచన మేరకు అమలాపురంలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ సెప్టెంబర్ 13న మరణించారు. ఈ ఘటనపై మృతుడి భార్య మైగాపుల శైలజ ఇచ్చిన ఫిర్యాదు మేరకు రావులపాలెం పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఏడుగురికి జరిమానా : సీఐ

విశాలాంధ్ర ప్రతినిధి- ఏలూరు : మద్యం సేవించి వాహనాలు నలిపే వాహనదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఏలూరు ట్రాఫిక్ సిఐ లక్ష్మణరావు హెచ్చరించారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న ఏడుగురు వ్యక్తులపై కేసులు నమోదు చేసి ఏలూరు సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి కెవిఆర్.మహేశ్వరి రూ.22 వేలు జరిమానా విధించినట్లు చెప్పారు. వాహనదారులు మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల అనేక ప్రమాదాలు సంభవించే అవకాశాలు ఉన్నాయని వివరించారు. అందువల్ల ఏలూరు జిల్లా ఎస్పీ కె.ప్రతాప్ శివ కిషోర్, డీఎస్పీ డి.శ్రావణ్ కుమార్ ఆదేశాల మేరకు ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనపై పోలీసులు కఠినంగా వ్యవహరించి కేసులు నమోదు చేస్తున్నామన్నారు. అంతేకాకుండా డ్రంక్ అండ్ డ్రైవ్ ప్రతిరోజు నిర్వహించి మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై కేసులు నమోదు చేస్తున్నామన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల మైకంలో ఉన్న వాహనదారులు మితిమీర వేగంతో వాహనాలు నడిపి ప్రమాదాలకు కారణం అవుతున్నారని వివరించారు. అందువల్ల వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను పాటించడంతోపాటు మద్యం సేవించి వాహనాలు నడపకుండా జాగ్రత్త పడాలని లేనిపక్షంలో కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ లక్ష్మణరావు హెచ్చరించారు.

పోడు భూములకు పట్టాలు ఇవ్వాలి : దారయ్య

విశాలాంధ్ర-జంగారెడ్డిగూడెం : అటవీ హక్కుల చట్టం ప్రకారం సాగులో ఉన్న పోడు భూములకు ప్రభుత్వం వెంటనే పట్టాలు మంజూరు చేయాలని, వలస ఆదివాసి పిల్లలకు కుల ధృవీకరణ పత్రాలు మంజూరు చేయాలని, ఆంధ్రప్రదేశ్ గిరిజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు కారం ధారయ్య డిమాండ్ చేశారు. గిరిజన వలస గిరిజనుల సమస్యలు పరిష్కారం కోరుతూ సోమవారం జంగారెడ్డిగూడెం డివిజన్ అధికారి కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. తొలుత వర్షాన్ని సైతం లెక్కచేయకుండా రెవెన్యూ డివిజన్ కాకార్యాలయం వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. ఇన్చార్జి రెవెన్యూ డివిజన్ అధికారి కి మెమోరాండం సమర్పించారు. అనాదిగా పోడు నరికి భూములు సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని, అదేవిధంగా వలస ఆదివాసి గిరిజనులు 2005 సంవత్సరం కంటే ముందు నుండే పోడు సాగు చేసుకుంటున్నార్నారు. బుట్టాయిగూడెం జీలుగుమిల్లి మండలాల్లో ఉన్న ప్రభుత్వ భూములు పేదలకు పంచాలని ఆయన డిమాండ్ చేశారు. జీవో నెంబర్ 3ని పటిష్టంగా అమలు చేయాలని ఆయన అన్నారు. జీలుగుమిల్లి మండలంలో నేవీ ఆయుధ కర్మాగారం డిపో ఏర్పాటును విరమించుకోవాలన్నారు. 20 ఏళ్ళ నుంచి ఇక్కడే ఉంటున్న వలస గిరిజనులకు కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వటంలో ప్రభుత్వాలు జాప్యం చేస్తున్నాయన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం పోడు సాగు భూములకు పట్టాలు ఇవ్వాలని, గిరిజన గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని వలస గిరిజనుల పిల్లలకు కులధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ గిరిజన సమాఖ్య నాయకులు పిట్టా వీరయ్య, బంధం అర్జున్,కరటం వెంకటేష్, సోడే నాగేష్, సోడెమారయ్య, వంజం శ్రీను, సోడె రమేష్, మడకం ఇరమయ్య, కురసం సూర్య చంద్రరావు, తెల్లం మునేశ్వరరావు పాల్గొన్నారు

యూరియా కొరతపై ప్రభుత్వం వైఫల్యం

విశాలాంధ్ర ప్రతినిధి- ఏలూరు : రైతులు ఎదుర్కొంటున్న యూరియా కొరతను అధిగమించడంలో ప్రభుత్వం విఫలమైందని ఏలూరు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు రాజనాల రామ్మోహన్ రావు విమర్శించారు. కల్లబొల్లి మాటలు చెబుతూ రైతులను కూటమి ప్రభుత్వం మభ్యపెడుతుందని ఎద్దేవా చేశారు. యూరియా కొరతలు నిర్మూలించి బ్లాక్ మార్కెట్ తరలింపును అడ్డుకోవాలని నినదిస్తూ జిల్లా కాంగ్రెస్ ఆధ్వర్యంలో సోమవారం నిరసన చేపట్టారు. అనంతరం గోదావరి సమావేశ మందిరంలో అధికారులకు యూరియా కొరతను నిర్మూలించాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాజనాల రామ్మోహన్ రావు మాట్లాడుతూ యూరియాను బ్లాక్ మార్కెట్లో విక్రయిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇదే పరిస్థితి కొనసాగితే రైతులు ఆత్మహత్య చేసుకునే పరిస్థితులు సంభవిస్తాయని ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లాలో రూ.300 ఖరీదు చేసే యూరియా బస్తాను బ్లాక్ మార్కెట్లో రూ.1000కు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్న దళారులను అరికట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షులు మద్దుకూరి బుచ్చి రాజు, జిల్లా ఉపాధ్యక్షులు కే.రాజారత్నం, జిల్లా ప్రధాన కార్యదర్శి పొన్న రామచంద్ర రావు, మాజీ ఎమ్మెల్యే ఎలిజా, దెందులూరు ఇంచార్జ్ ఆలపాటి నరసింహమూర్తి, ఉంగుటూరు ఇంచార్జ్ పెద్దిరెడ్డి సుబ్బారావు, ఏలూరు టౌన్ కిసాన్ సెల్ అధ్యక్షులు కొమ్మన్న సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగుల నిరసన

విశాలాంధ్ర – ఏలేశ్వరం : మండలంలోని ఎర్రవరం గ్రామంలో విద్యుత్ సబ్స్టేషన్ వద్ద సోమవారం ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా జగ్గంపేట జేఏసీ 1104 సంఘ అధ్యక్షుడు పి శ్రీనివాసరాజు మాట్లాడారు. విద్యుత్ శాఖ ప్రైవేటీకరణకు రాష్ట్ర జేఏసీ వ్యతిరేకం అన్నారు. కాంట్రాక్టు ఉద్యోగులను వెంటనే రెగ్యులర్ చేయాలని. విద్యుత్ శాఖలో అన్ని విభాగాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు నగదు రహిత వైద్యం అందించాలని దశల వారి ఉద్యమం నిర్వహిస్తామన్నారు. ఉద్యమంలో భాగంగా ఈ నెల 17, 18న కాకినాడ విద్యుత్ సర్కిల్ కార్యాలయం వద్ద నల్ల బ్యాడ్జీలతో నిరసన చేపడతామన్నారు. ఈనెల 19, 20న సబ్ స్టేషన్ వద్ద 22న తేదీన జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసనలు తెలియజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సిబ్బంది కే అప్పారావు, బాబ్జి క్యాలంగి సతీష్, శ్రీనివాస్ ఉన్నారు.

భారీ స్థాయిలో అన్న సమారాధన

విశాలాంధ్ర-దేవరపల్లి: దేవరపల్లి చంద్రబాబు నాయుడు కాలనీలో వినాయకుని ఆలయం వద్ద సోమవారం భారీ స్థాయిలో అన్న సమారాధన జరిగింది. గణపతి నవరాత్రులు మహోత్సవాలు అనంతరం ఆలయ అభివృద్ధి కమిటీ అన్న సమారాధన నిర్వహించింది. సోమవారం ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు . ఈ సందర్భంగా జరిగిన అన్న సమారాధనలో సుమారు 4000 మంది భక్తులు అన్న ప్రసాదం స్వీకరించారు దేవరపల్లి లక్ష్మీపురం పల్లంట్ల రామన్నపాలెం బందపురం దుద్దుకూరు దుమ్మంతును గూడెం గ్రామాల నుండి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అన్న ప్రసాదం స్వీకరించారు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు భక్తులకు విశేష ఏర్పాటు చేశారు.

హెచ్ఐవి, మారకద్రవ్యాల దుష్పరిణామాలపై అవగాహన

విశాలాంధ్ర - కడియం : హెచ్ఐవి, మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాల పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని అని కడియం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి సత్యనారాయణ అన్నారు. సోమవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాల విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి యువత హెచ్ఐవి బారిన పడకుండా తగు జాగ్రత్తలు వహించాలని, యువత డ్రగ్స్ కు దూరంగా ఉంటూ వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో కోనసీమ సేవా మండలి సి. ఎస్సీ 2.0, రాజమండ్రి కోఆర్డినేటర్ జి రాజశేఖర్, ఎన్ నాగమణి పాల్గొని, స్థానిక జూనియర్ కాలేజీ, హైస్కూల్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి సత్యనారాయణ, పాఠశాల వ్యాయమ దర్శకులు డేవిడ్, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

అంతరాష్ట్ర పూల మార్కెట్‌కు డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేయండి

విశాలాంధ్ర - కడియం : తూర్పుగోదావరి జిల్లా కడియం మండలం కడియ పులంక శ్రీ ఆంజనేయ పూల రైతు వర్తక మార్కెట్‌కు డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేయా లంటూ పూల మార్కెట్ అధ్యక్షుడు నాగులపల్లి వీరబాబు అన్నారు. ఈ సమస్యపై కలెక్టరేట్లో నిర్వహించిన పిజిఆర్ఎస్ లో ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు. ఉభయగోదావరి జిల్లాలతో పాటు దేశ నలుమూలల నుండి టన్నులకొద్ది పువ్వులు ఈ మార్కెట్ కు వస్తూ ఉంటాయని, వీటిలో మిగులు పువ్వులను తూర్పు డెల్టా ప్రధాన కాలువ వెంబడి పొయ్యడంతో కుళ్లి దుర్వాసన వెదజల్లుతుందని దానితో రైతులతో పాటు వ్యాపారులు పలు ఇబ్బందులకు గురవుతున్నారని ఆయన అన్నారు. ఎంతో ప్రాధాన్యత గల ఈమార్కెట్‌కు అధికారులు స్పందించి డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేయాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పూలవర్తక సంఘం సభ్యులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

విశాలాంధ్ర -జీలుగుమిల్లి : పేదల ఆరోగ్యం, సంక్షేమానికి కూటమి ప్రభుత్వం మొదటి ప్రాధాన్యత ఇచ్చి పేదలకు అండగా నిలుస్తుందని పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు అన్నారు. సోమవారం బర్రింకలపాడు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గం లోని 23 మంది లబ్ధిదారులకు గాను రూ. 19లక్షల విలువైన చెక్కులు పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు. భవిష్యత్తులో మెరుగైన వైద్య సేవలు అందించడానికి ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు.

ఆదిత్యలో వేద-2కె25 జాతీయ సాంకేతిక సింపోజియం

విశాలాంధ్ర - గండేపల్లి : గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీ. భారతదేశపు తొలి ఇంజనీర్ అయిన మోక్షగుండం విశ్వేశ్వరయ్య జన్మదినాన్ని పురస్కరించుకొని ఇంజనీరింగ్ డే సందర్భంగా విద్యా స్ఫూర్తితో జాతీయ స్థాయి సాంకేతిక సింపోజియం వేద ఘనంగా ప్రారంభ మైంది. ఈ సంవత్సరం వేదను ››Deep Tech & Engineering Excellence: Driving Indias Techadeuu అనే స్ఫూర్తిదాయకమైన అంశంతో నిర్వహించారు. ఆదిత్య యూనివర్సిటీ ప్రో ఛాన్సలర్ నల్లమిల్లి సతీష్ రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశానికి జెఎన్టియుకె వైస్ ఛాన్సలర్ చేకూరి శివరామ కృష్ణ ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరు కాగా యూనివర్సిటీ డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డా మేడపాటి శ్రీనివాస రెడ్డి, వైస్ ఛాన్సలర్ ప్రో ఎంబి శ్రీనివాస్, ప్రో వైస్ ఛాన్సలర్ (అకడమిక్) డా ఎస్ రమాశ్రీ, డా ఆదిరెడ్డి రమేష్, డా రవి తంగ జన్, రిజిస్ట్రార్ డా జి సురేష్, వేద-2కె25 కో ఆర్డినేటర్ డా డి కిషోర్ పాల్గొన్నారు. జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభమైన కార్యక్రమంలో ప్రో చాన్స్‌లర్ డా ఎన్ సతీష్ రెడ్డి వేద ప్రారంభం మరియు దాని స్థిరమైన వృద్ధిని గుర్తుచేసుకుంటూ, ఇది జాతీయ స్థాయిలో సాంకేతిక ప్రతిభను, ఆవిష్కరణలు పెం పొందించే వేదికగా ఎలా రూపుదిద్దుకుంది అనే వివ రాలు వివరించారు. వేదవ్యాప్తి, ప్రభావాన్ని ప్రతి సంవత్సరం విస్తరింపజేసే నిర్వాహక బృందం కృషిని ఆయన ప్రశంసించారు. ముఖ్య అతిథి డా సిఎస్ఆర్‌కె ప్రసాద్ తన ప్రధానోపన్యా సంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న సాంకేతిక యుగంలో పోటీతత్వాన్ని కొనసాగించడానికి ఉత్తమ సాధన, నిరంతర నైపుణ్యాభివృద్ధి అవసరాన్ని పునరుద్ఘాటించారు. విద్యార్థులు నూతన ఆవిష్కరణలను చేసి భవిష్యత్‌కు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. వేద కన్వీనర్ డా కిషోర్ తన ప్రసంగంలో, ఈ సంవత్సరం దేశ నలుమూలల నుండి నుండి 14,340 మంది విద్యార్థులు వేదలో వివిధ సాంకేతిక పోటీలకు, ఈవెంట్లకు నమోదు చేసుకున్నారని తెలిపారు. విద్యార్థుల సాంప్రదాయ నృత్య ప్రదర్శన ఎంతో ఆకట్టుకుంది ఆదిత్య యాజమాన్యం తరుపున అతిథులను ఘనంగా సత్కరించారు. విద్యార్థులు ప్రదర్శించిన పలు ప్రాజెక్టులు పరిశీలించిన ప్రతినిధులు విద్యార్థులను అభినందించారు. ఇంజనీర్ల ప్రతిభకు అద్దం పడుతూ ద్వితీయ సంవత్సరం సీఎస్ఈ విద్యార్థి డొంకిన వీర భాగ్యేష్ వ్రాసిన కవిత విశేషంగా ఆకట్టుకుంది.

ఘనంగా చవితి అన్నదానాలు

విశాలాంధ్ర - కాకినాడ : గణేశ ఉత్సవాల వలన యువతలో ఆధ్యాత్మిక దృక్పథం సామాజిక సేవ జీవితంలో క్రమశిక్షణ అలవడతాయని ఏపీ నగర గణేశ ఉత్సవ సమితి గౌరవ అధ్యక్షుడు దూసర్ల పూడి రమణరాజు పేర్కొన్నారు. స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద జై గణేష్ ఆటో యూనియన్ 19వ వార్షిక అన్నదానం నిర్వహించారు. 5వేల మందికి భోజనాలు వడ్డించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న రమణ రాజు మాట్లాడుతూ కార్మికులు గణేశుని పట్ల భక్తి శ్రద్ధలతో దాతలతో బాటుగా ప్రతి సభ్యుడు చందా వేసుకుని భారీగా కార్యక్ర మాలు నిర్వహించడం ఆదర్శప్రాయమన్నారు. ఈ ఏడాది కాకినాడ జిల్లాలో తుని పిఠాపురం పెద్దాపురం జగ్గంపేట ప్రత్తిపాడు కాకి నాడ సిటీ కాకినాడ రూరల్ నియోజకవర్గాలకు చెందిన నగర పట్టణ మండల గ్రామ ప్రాంతాల్లో 12వేల చవితి పందిర్లలో విరివిగా అన్నదానాలు జరుగు తున్నాయ న్నారు. నిర్వాహకులకు ఏపీ నగర గణేశ ఉత్సవ సమితి ప్రశంసాపత్రాలు అంది స్తున్నామన్నారు. 9948146 999 సెల్ నంబర్‌కు నిర్వాహకులు వారి పూర్తి అడ్రస్ పిన్ కోడ్‌తో వాట్సప్ చేస్తే పోస్టల్ ద్వారా వారికి ప్రశం స పత్రాలు పంపిస్తామని రమణరాజు తెలిపారు. కాకి నాడ సిటీ రూరల్ ప్రాంతాల్లో నేరుగా అంది స్తారన్నారు. మార్చి 15న భోగి గణపతి పీఠం ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నూతన సంవ త్సర తెలుగు ఉగాది వేడుక పంచాంగ శ్రవణం నిర్వహించి ఏపీ గణేశ ఉత్సవ సమితి జిల్లా నూతన కార్యవర్గాన్ని మున్ముగు ఆహ్వాన కమిటీలను ఏర్పాటు చేస్తామని రమణరాజు ప్రకటించారు. జై గణేశ్ ఆటో యూనియన్ పెద్దలు ఎన్ బాలు, డివివి ప్రసాద్, సూరిబాబు, శ్రీను, లోవరాజు పర్యవేక్షించారు.

నిర్మలగిరి మేరీ మాత పుణ్యక్షేత్రానికి రెండు ఏసీల అందజేత

విశాలాంధ్ర -దేవరపల్లి : మండలంలోని నిర్మల గిరి మేరీ మాత పుణ్యక్షేత్రానికి నిర్మలగిరి మేరీమాత పుణ్యక్షేత్ర అన్నదాన కాంట్రాక్టర్ కళ్లే నాగేశ్వరావు లక్ష రూపాయలు విలువ చేసే రెండు ఏసీలను నిర్మలగిరి మేరీ మాత పుణ్యక్షేత్ర డైరెక్టర్ ఎస్ జాన్ పీటర్‌కు అందజేశారు ఈ సందర్భంగా నిర్మలగిరి మేరీ మాత పుణ్యక్షేత్ర డైరెక్టర్ ఎస్ జాన్ పీటర్ మాట్లాడుతూ మేరీ మాత మందిరాన్ని అద్దాలతో సర్వ సుందరంగా అలంకరించడం భక్తుల సౌకర్యార్థం ఏసీలు కూడా ఏర్పాటు చేశారని, దానికి అన్నదాన కాంట్రాక్టర్ కళ్లే నాగేశ్వరావు రెండు ఏసీలను అందజేయటం ఎంతో అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఫాదర్స్ ప్రేమ్ కుమార్ శివ శ్యామ్ అనిల్ పాల్గొన్నారు

స్వయం ప్రతిపత్తి గల నేర పరిశోధన వ్యవస్థలు కావాలి

- రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్

విశాలాంధ్ర - రాజమండ్రి సిటీ

నేడు స్వయం ప్రతిపత్తి గల నేర పరిశోధన వ్యవస్థలు కావాలని రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ (ఆర్పిసి) ప్రధాన కార్యా లయంలో జరిగిన పార్టీ వారాంతపు సమావేశంలో ఆర్పిసి వ్యవస్థాపక అధ్య క్షులు మేడా శ్రీనివాస్ అన్నారు. ఆయాషా మీరా హత్య ఉదంతం జరిగి 18 సంవ త్సరాలు గడి చినా నేటికీ న్యాయం జరగలేదని, ఆ తల్లిదండ్రులు ఘోష వినే సమయం , ఓపిక సైతం మన పాలకు లకు లేకుండా పోవడం సిగ్గు చేటని ఆయన అన్నారు. ఆయాషా మీరా కేసును కేవలం రాజకీయాలకు మాత్రమే వాడుకున్న రాజకీయ ప్రబుద్ధులు నాటి ఉమ్మడి రాష్ట్రం నుండి విభజిత ఆంధ్రప్రదేశ్ వరకు న్యాయం చేయడంలో కాలయాపన చేస్తూనే ఉన్నా రన్నారు. ఆయాషా మీరాకు జరిగిన అన్యాయం పట్ల విద్యార్థి లోకం కూడా సరైన రీతిలో స్పందించలేదని, కొంతమంది సినిమా వాళ్ళు, కుల, మత ఉన్మాదుల స్వార్థ ప్రయోజనాల కోసం ఆంధ్రప్రదేశ్ భవిష్యత్ పై విషం చిమ్మటమే అందుకు గల కారణమన్నారు. భారత్‌లో న్యాయం అంగడి సరుకులో ఒక వస్తువు వలే మారిపో యిందని, న్యాయస్థానాలు సైతం కాల యాపన తీర్పుల కారణంగా బాధితుల విసిగి పోతున్నా రన్నారు.న్యాయం ఖరీదైనదిగా మారటం వల్ల బాధి తులు అత్యున్నత న్యాయస్థా నాల గడప వరకు కూడా చేరుకోలేకపోతున్నారని, ఉచి త సహాయ న్యాయ కేంద్రాలు ఉన్నప్ప టికి ఫీజు లేని సేవలు అందించటానికి అంతగా ఆ శక్తి చూపలేకపోతున్నార న్నారు. నేటి వరకు సి.బి.ఐ చేపట్టిన కేసుల్లో సత్వర న్యాయం పొందిన భాదితులు మన దేశంలో ఉన్నారా అని ఆయన ప్రశ్నించారు. 27 తేది డిసెంబర్ 2007 లో ఆయాషా మీరా హత్య కు గురి కాగా ఆగస్టు 2008 సత్యంబాబు అనే అనుమానితుడును పోలీస్‌లు అరెస్ట్ చేసారని, విజయవాడ మహిళా సెషన్స్ కోర్టు సత్యం బాబుకు జీవితఖైదు విధించగా, 2017 మార్చి 31 న హైకోర్టు సత్యంబాబును నిర్దోషిగా విడుదల చేసిందన్నారు. అయేషా మీరా తల్లిదండ్రులు హై కోర్టును ఆశ్రయించగా కేసు ధర్యాప్తును సి.బి.ఐకి బదిలీ చేసారని, 2018లో పునః దర్యాప్తు చేపట్టి 6 సంవత్సరాల 6 నెలల అనం తరం మన అత్యున్నత సి బి ఐ సంస్థ హై కోర్టులో దర్యాప్తు నివేదికను దాఖ లు చేసి, మృతు రాలు తల్లిదండ్రులకు నివేదిక ప్రతు లను ఇవ్వటానికి నిరకరించారన్నారు. ఈ అధికార దుర్వినియోగంపై తల్లిదండ్రులు హైకోర్టును ఆశ్ర యించగా దిగువస్థాయి కోర్టులో తేల్చు కోమని సూచించిన మీదట విజయ వాడ న్యాయ స్థానంలో పిటిషన్ దాఖలు చేసినా నేటి వరకు తల్లిదండ్రులకు ఏ విధ మైన ఊరట లభించలేద న్నారు. ఇంత పెద్ద స్థాయి లో సిబిఐ అధికార దుర్వి నియోగ విధులు సాగు తున్న క్రమంలో మృతురాలి తల్లిదండ్రులకు నేడు సిబిఐ కార్యాలయం నుండి నోటీసులు జారి చేసారని, ఏ నమ్మకంతో బాధిత తల్లి దండ్రులకు సిబిఐ నోటీ సులు జారిచేసిందని ఆయన ప్రశ్నించారు. రాజకీయ పాలకులకు కీలుబొమ్మగా ఉన్న ప్రస్తుత నేర పరి శోధన సంస్థల కార ణంగా సామాజిక భద్ర తకు , దేశ భద్రతకు పెను ప్రమాదం పొంచి వుందని ప్రజలు గుర్తించాలన్నారు. అయేషా మీరా హత్యను చెందించలేని మన చేతకాని దద్దమ్మ పాలకులు సుగాలి ప్రీతి కేసులో న్యాయం చేస్తారా అని ఆయన ప్రశ్నించారు. నేపాల్ లో ఒక బాలికను ఒక అమాత్యుడి వాహనం ఢీకొని వెళ్లిన ఘటనలో పాలకుల తీరుకు వ్యతిరే కంగా ఉవ్వెత్తున లేచిన ప్రజా తిరుగుబాటు ఆంధ్రప్రదేశ్ లో రావాలన్నారు. అయేషా మీరా , సుగాలి ప్రీతి, ఒక శ్రీ లక్ష్మి, ఒక పసి బాలికను నిప్పుల కోలు ములో కాల్చిన సంఘటనలు జరిగినప్పటికీ ఆంధ్రుల్లో చలనం లేదని, మన ఆంధ్రుల్లో నరాలు చచ్చుబడి పోయాయన్నారు. ఒక్కసారి గతించిన ఆంధ్రుల పౌరుషం పుణికి పుచ్చుకుంటే నేటి పాలకులకు ఒక శ్రీలంక, బంగ్లాదేశ్, మయన్మార్ , నేపాల్ ప్రజా తిరుగు బాటుకు మించి ఉప్పెన కనిపిస్తుందని మేడా శ్రీని వాస్ అన్నారు. సభకు ఆర్పిసి సీనియర్ సెక్యులర్ పెండ్యాల కామరాజు అధ్యక్షత వహించారు .

బిసిసి బోర్డు పునరుద్ధరించాలి

విశాలాంధ్ర - నిడదవోలు : పాలకులకు చిత్తశుద్ధి వుంటే తక్షణమే బిఓసి బోర్డు పథకాలను అమలు చేయాలని ఆంధ్ర ప్రదేశ్ ప్రగతిశీల భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె.వి. రమణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా భవన నిర్మాణ కార్మికుల సభ సోమవారం నిడదవోలు లోనికామాక్షి విశ్వ బ్రాహ్మణ కళ్యాణ మంటపంలో నిర్వహించారు. ఈ సభలో పాల్గొన్న కె.వి. రమణ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు భవన నిర్మాణ కార్మిక సంక్షేమ మండలి ద్వారా ప్రసూతి, మరణం, వైద్యం, వివాహం తదితరాలకు అందచేయాల్సిన ఆర్థిక పరిహారాలు గత వైసిపి, నేటి కూటమి ప్రభుత్వం రెండూ కూడా అమలు చేయక పోవడం ద్వారా కార్మిక వర్గం పట్ల తమ కున్న వివక్ష ను నిరూపించుకున్నారన్నారు. పాలకులకు చిత్తశుద్ధి వుంటే తక్షణమే బిఓసి బోర్డు పథకాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఐ.యఫ్.టి.యు జిల్లా నాయకులు మానికల నాగరాజు , ఈమని గ్రీష్మ కుమార్ మాట్లాడుతూ ఎన్నికల్లో భవన నిర్మాణ కార్మికుల ఓట్ల కోసం హామీలు గుప్పించి నది దాటాక బోడి మల్లన్న చందంగా ఎన్నికల హామీలను తుంగలో తొక్కి కూటమి ప్రభుత్వం పాలన చేస్తోందని, కార్మికుల సంక్షేమానికి బోర్డు నిధులు ఖర్చు పెట్టడానికి మనసు రాని ప్రభుత్వం తమ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థికి మాత్రం చైర్మన్ పదవి కట్టబెట్టి బోర్డు నిధులు ఖర్చు చేస్తోందనీ, చైర్మన్ వల వల బాబ్జీ పదవి చేపట్టి నెలలు గడుస్తున్నా బోర్డు పథకాల పునరుద్దరణ పై పెదవి విప్పడం లేదని, వేలాది రూపాయలు జీత భత్యాలు మాత్రం పొందుతూ, కార్మిక సంక్షేమాన్ని గాలికొదిలేశారన్నారు. సభలో ప్రగతిశీల భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు యస్. రామ్మోహన్, యెర్రాశ్రీను, లింగమల్లు శ్రీను, ఎర్రా శ్రీను,పామర్తి సత్య నారాయణ, నౌడు నెహ్రూ,పాతకోకల నాగేశ్వరరావు, సి.హెచ్. రమేష్, కాకర్ల శ్రీను,గెడ్డం రవీంద్ర, రొంగల హరీష్, రాజేష్ , ఈ. మల్లిక, యస్. కె. వలీ , ఖండవల్లి వీర వెంకట్రావు , రవ్వ సురేష్ కుమార్, కోనేటి మల్లేశ్వర రావు , మల్లిడి రామిరెడ్డి, సురేష్, మంచిలి రాజు, షేక్ బాజీ , యస్.సూరిబాబు, దేవుడు, నీలం సురేష్,గోగుల చిన్నయ్య, యమ్. ప్రసాద్, దుర్గా రావు, కార్మికులు తరలి వచ్చారు.

పిజిఆర్‌యస్ అర్జీలపై దృష్టి సారించాలి

విశాలాంధ్ర - ఏలూరు : జిల్లా స్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని సోమవారం జిల్లా స్థాయి అధికారులతో జిల్లా జాయింట్ కలెక్టరు పి.ధాత్రిరెడ్డి నిర్వహించారు. జాయింటు కలెక్టరుతో పాటు జిల్లా రెవెన్యూ అధికారి వి.విశ్వేశ్వర రావు, ఎస్సీ కార్పొరేషన్ ఈడి యం. ముక్కంటి, స్పెషల్ డిప్యూటీ కలెక్టరు యల్.దేవకిదేవి, డిఆర్డిఏ పిడి ఆర్.విజయ రాజు,జడ్పీ సిఇవో యం.శ్రీహరి, నగర పాలక సంస్థ కమిషనరు ఏ.భాను ప్రతాఫ్,సర్వే ఎడి అన్సారీలు అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా జాయింటు కలెక్టరు పి.ధాత్రిరెడ్డి మాట్లాడుతూ సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా జిల్లాలో పలు ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారులు నుండి 268 ఫిర్యాదులను స్వీకరించామని తెలిపారు.ప్రజా సమస్యలు పరిష్కారంపై ప్రత్యేక పర్యవేక్షణ చేస్తున్నందున జిల్లా అధికారులు వారి శాఖలకు సంబంధించిన అర్జీలను క్షుణంగా పరిశీలించి తమ సిబ్బందితో నిర్ణీత గడువులోగా త్వరితగతిన, సత్వర పరిష్కార చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, జిల్లా కలెక్టరేటు సూపరెంట్లు, తదితర ఉద్యోగులు పాల్గొన్నారు.

'కె 9' కష్టం వస్తే....కాపు కాస్తుంది

విశాలాంధ్ర - బుట్టాయగూడెం: కె9 కష్టం వస్తే.... కాపు కాస్తుంది... అనే మంచి ఆశయంతో జంగారెడ్డిగూడెం కేంద్రంగా ఏర్పాటైన సేవా సంస్థ నిస్సహాయులను ఆదుకోవడంలో ముందుంటుందని ఆ సంస్థ అధ్యక్షుడు తొమ్మిదేళ్ల శ్రీనివాసరావు అన్నారు. బుట్టాయగూడెంకు చెందిన ఎర్రమళ్ళ అశోక్ కుమార్ సుమారు నెలరోజుల క్రితం పేరుపాలెం బీచ్ కు స్నేహితులతో వెళ్లి, అక్కడ జరిగిన మోటార్ సైకిల్ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ప్రమాదంలో అశోక్ కుమార్ మెడ నరాలు గాయపడి, వెన్నుపూసకు గాయం కావడంతో సుమారు ఆరు లక్షల రూపాయల వ్యయంతో చికిత్స అందించిన ప్పటికీ, మంచానికి పరిమితమయ్యాడు.ే బాధితులు కుటుంబానికి 5000 రూపాయల నగదు ఆర్థిక సహాయం, మరో ఐదు వేల రూపాయల నిత్యావ సరాలను అందించారు. ఈ సందర్భంగా కే 9 సంస్థ అధ్యక్షుడు తొమ్మిదేళ్ల శ్రీనివాసరావు మాట్లాడుతూ కె 9 సంస్థ ద్వారా అశోక్ కుమార్ కు మరింత సహాయం అందించడానికి ప్రయత్నిస్తామని చెప్పారు. ఈకార్యక్రమంలో సంస్థ కార్యదర్శి శీలం కృష్ణంరాజు, కోశాధికారి పి. మోహన్, సహాయ కార్య దర్శి మనికే సత్యనారాయణ, న్యాయభాగం అధ్య క్షుడు ఉద్దండం ఏసుబాబు, మీడియా అధ్యక్షుడు కె.ఎస్. శంకర్రావు, ఆకుల ఏసుబాబు, మర్రి రమేష్, స్థానిక కాపుకుల ప్రతినిధులు కట్రెడ్డి సురేష్ గరికపాటి రవీంద్ర, దండా బత్తుల ఫణి కుమార్, కరిమికొండ శివాజీ, నూకల కాంతినాథ్ పాల్గొన్నారు.

మహిళల కోసం శక్తి యాప్

విశాలాంధ్ర - గణపవరం: సమాజంలో ఏదో ఒక ప్రక్కన మహిళలు అత్యాచారాలకు గురవుతారని దానికి గురి కాకుండా శక్తి యాప్ ద్వారా చర్యలు తీసుకోవచ్చునని నిడమర్రు ఎస్ఐ ఎన్ వీరప్రసాద్ అన్నారు. సోమవారం గణపవరం శ్రీ చైతన్య విద్యాసంస్థ లో విద్యార్థులకు ఎస్ఐ ఎవేర్నెస్ కార్యక్ర మాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సైబర్ నేరగాళ్ల వలలో పడవద్దు అని ఇన్స్టాగ్రామ్ వంటి యాప్లకు సైబర్ నేరగాళ్లకు దూరంగా ఉండాలని ఆయన అన్నారు. రోడ్డు భద్రత తప్పనిసరిగా అందరూ పాటించాలని డ్రైవింగ్ లైసెన్స్ వాహనం ఇన్సూరెన్స్ సి బుక్ హెల్మెట్ తప్పనిసరిగా ధరించి రోడ్ల పైన ప్రయాణం చేయాలని కోరారు. ఇటీవల కాలంలో బాలికలపై అత్యాచారాలు ఎక్కువ జరుగుతున్నాయని జరక్కుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని అన్నారు. విద్యార్థులు చదువుపై దృష్టి పెట్టి ఎక్కువ మార్కులు వచ్చేలా చూసుకోవాలని ఆయన కోరారు. సెల్ ఫోన్ తో సమయాన్ని వృధా చేయొద్దని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీ చైతన్య విద్యాసంస్థ ప్రిన్సిపాల్ పి రామ్ ప్రకాష్ డీఎన్ పి ఏసుబాబు విద్యార్థులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కలెక్టర్ల సమావేశం

విశాలాంధ్ర - భీమవరం : సోమవారం ఏపి సచివాలయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన ప్రారంభమైన జిల్లా కలెక్టర్ల సదస్సులో పశ్చిమగోదా వరి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి పాల్గొన్నారు. ఆమె ప్రక్కన గతంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా జాయింట్ కలెక్టర్‌గా పని చేసి ప్రస్తుతం పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లాను కూడా చిత్రంలో చూడవచ్చు.

విఘ్నేశ్వరుడి ఆశీర్వాదంతో ప్రజలు బాగుండాలి : ఎమ్మెల్యే బడేటి

విశాలాంధ్ర - ఏలూరు : శ్రీ విఘ్నేశ్వర స్వామివారి ఆశీస్సులతో లోకమంతా చల్లగా వర్ధిల్లాలనీ ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి ఆకాంక్షించారు. ఏలూరు చాణిక్యపురీ కాలనీ 2వ రోడ్డులో శ్రీ లక్ష్మీగణపతి స్వామివారి 23వ వార్షిక చవితి మహోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉత్సవాల ముగింపులో భాగంగా సోమవారం భారీ అన్న సమారాధ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి ముఖ్య అతిధిగా పాల్గొని విఘ్నేశ్వర స్వామికి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం అన్న సమారాధనను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చంటి మాట్లాడుతూ స్వామివారి కృపాకటాక్షలు ప్రజలందరిపై ఉండాలనీ ఆకాంక్షించారు. తొలుత ఆయన్నీ కమిటి సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఈడా ఛైర్మన్ పెద్దిబోయిన శివప్రసాద్, ఎఎంసి చైర్మన్ మామిళ్ళపల్లి పార్థసారధి, డిప్యూటి మేయర్ పప్పు ఉమామహేశ్వరరావు, టిడిపి నగర అధ్యక్షులు చోడే వెంకటరత్నం, 30వ డివిజన్ టిడిపి ఇన్‌ఛార్జ్ బడిశెట్టి శ్రీనివాసరావు కమిటీ సభ్యులు డొక్కా దుర్గారావు, బోసు ఈశ్వరరావు, గాలి దుర్గారావు, బోన దుర్గారావు, మాగల నూకరాజు, వివిధ హోదాల్లో ఉన్న తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

రాజ్‌న్యూస్ అవార్డుకు దాకారపు కృష్ణ ఎంపిక

విశాలాంధ్ర - జంగారెడ్డిగూడెం : ఏలూరు జిల్లా, జంగారెడ్డిగూడెం పట్టణానికి చెందిన యువ చార్టర్డ్ అకౌంటెంట్, సామాజికవేత్త దాకారపు కృష్ణ ప్రతిష్టాత్మక రాజ్ న్యూస్ తెలుగు బిజినెస్ ఎక్సలెన్స్ అవార్డు 2025 కు ఎంపికయ్యారు. ప్రతీ సంవత్సరం వివిధ రంగాలు, అంశాలలో తమదైన రీతిలో సమాజానికి విలువైన సమయం, సేవను అందిస్తున్న ప్రముఖులను గుర్తించి పురస్కారం అందించి వారి స్ఫూర్తిని విస్తృత సమాజానికి పరిచయం చేస్తూ, భావితరాలకు ప్రేరణాత్మక మార్గనిర్దేశం చేసే క్రమంలో వారి విశిష్ట సేవలతో సామాజిక ప్రభావంను గౌరవిస్తూ విశిష్ట సేవా పురస్కారంకు ఎంపిక చేసినట్టు రాజ్ న్యూస్ తెలుగు ప్రతినిధులు ప్రకటించి ఈ మేరకు దాకారపు కృష్ణకు ఆహ్వానం పంపారు. సెప్టెంబర్ 17,బుధవారం సాయంత్రం ఐదు (5) గంటలకు విజయవాడ ఏ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగే రాజ్ న్యూస్ తెలుగు బిజినెస్ ఎక్సలెన్స్ అవార్డ్స్ 2025 పురస్కార ప్రధాన కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ విద్యా శాఖా మంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా అవార్డు అందుకోనున్నారు.

అథ్లెటిక్ పోటీలకు అఖిల్ శ్రీ వర్మ రాష్ట్రస్థాయికి ఎంపిక

విశాలాంధ్ర - గణపవరం: పశ్చిమగోదావరి జిల్లా స్థాయిలో నిర్వహించిన అథ్లెటిక్ పోటీలు బాలుర ఉన్నత పాఠశాల తణుకు లో సోమవారం నిర్వహించామని ఫిజికల్ డైరెక్టర్ ఎం పద్మావతి తెలిపారు. ఈ పోటీలలో గణపవరం మండలం సరిపల్లె గ్రామానికి చెందిన ఎం రాంబాబు త్రివేణిల కుమారుడు ఎం అఖిల్ శ్రీ వర్మ ప్రధమ స్థానం సాధించినట్లు తెలిపారు. అథ్లెటిక్ విజయం సాధించి రాష్ట్రస్థాయికి మరొకసారి అర్హత సాధించాడని పీడీ తెలిపారు. అఖిల్ శ్రీ వర్మను గణపవరం మండలంలో పలువురు అభినందించారు.

17న మండల పరిషత్ సమావేశం

విశాలాంధ్ర - జంగారెడ్డిగూడెం : జంగారెడ్డిగూడెం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 17న మండల ప్రజా పరిషత్ అధ్యక్షురాలు కొదమ జ్యోతి అధ్యక్షతన మండల పరిషత్ కార్యాలయంలో మధ్యాహ్నం రెండు గంటలకు జరుగుతుందని మండల పరిషత్ అభివృద్ధి అధికారి కేఆర్ఎస్ కృష్ణప్రసాద్ తెలిపారు. సంబంధిత అధికారులందరూ సమావేశానికి సకాలంలో హాజరు కావాలని ఆయన కోరారు.

జడ్పీ ఉద్యోగుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాను : ఛైర్మన్ పద్మశ్రీ

విశాలాంధ్ర ప్రతినిధి - ఏలూరు : జిల్లా పరిషత్ యాజమాన్యంలో పనిచేస్తున్న ఉద్యోగుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నానని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ అన్నారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలో వివిధ జిల్లాలో పనిచేస్తున్న 13 మంది ఏవోలకు డిప్యూటీ ఎంపీడీవోలుగా పదోన్నతి కల్పిస్తూ ఉత్తర్వులను జడ్పీ చైర్ పర్సన్ క్యాంప్ కార్యాలయంలో సోమవారం సాయంత్రం అందించారు. ఈ సందర్భంగా ఘంటా పద్మశ్రీ మాట్లాడుతూ తాను పదవీ బాధ్యతలు చేపట్టిన వెంటనే కారుణ్య నియామకాల ఫైల్ పై తొలి సంతకం చేశానన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ముఖ్యంగా ఏళ్ల తరబడి పదోన్నతులకు నోచుకోని పంచాయితీ రాజ్ శాఖకు సీఎం నారా చంద్రబాబు చొరవతో ఉప ముఖ్యమంత్రి, పంచాయితీ రాజ్ శాఖ మంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ ప్రత్యేక శ్రద్ధతో ఎంపీడీవోలకు డిఎల్డివోలుగా, ఏవోలకు డిప్యూటి ఎంపీడీవోలుగా, డిప్యూటీ ఎంపీడీవోలకు ఎంపీడీవోలుగా పదోన్నతులు కల్పించడం సంతోషకరమైన విషయమన్నారు. ఈ పదోన్నతి మరింత బాధ్యతలు పెంచుతుందని అందువలన ఉద్యోగులు మరింత శ్రద్ధగా, సమర్ధవంతంగా పని చేసి మంచి పేరు తెచ్చుకోవాలని సూచించారు. ఇప్పటివరకు 87 మందికి పదోన్నతులు కల్పించామని, ఇందులో ఏవోలుగా 27 మంది, సీనియర్ అసిస్టెంట్‌లుగా 31 మంది, జూనియర్ అసిస్టెంట్‌లుగా 6 మంది, మరియు రికార్డ్/ లైబ్రరీ/ ల్యాబ్ అసిస్టెంట్‌లుగా 23 మంది ఉద్యోగులకు పదోన్నతులు కల్పించినట్లు పేర్కొన్నారు. జిల్లా పరిషత్ సీఈఓ శ్రీహరి మాట్లాడుతూ ఈ పదోన్నతులు ఉద్యోగులలో ఉత్సాహాన్ని పెంపొందించడమే కాకుండా కార్యాలయ పనితీరులోనూ మంచి మార్పులకు దారితీస్తాయని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో ఏవో జాన్సన్, రాఘవులు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలకు సన్మానం

విశాలాంధ్ర - కోరుకొండ : రాజానగరం నియోజకవర్గం కోరుకొండ మండలం కోరుకొండ ఆదిత్య ఫంక్షన్ హాల్‌లో జిల్లా మండల ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలకు మండల విద్యాశాఖ, మండల ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అతిథిగా జనసేన పార్టీనాయకురాలు బత్తుల వెంకటలక్ష్మి రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి, తెలుగుదేశం పార్టీ యువ నాయకులు పెందుర్తి అభిరామ్, బూరుగుపూడి సొసైటీ చైర్మన్ కంటే నాగకేశ్వర రావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ వెంకట రమణమ్మ, నాగేశ్వరరావు, అడపా వీరబాబు, మండల బిజెపి నాయకులు అడపా సుధీర్, గాదరాడ గ్రామ సర్పంచ్ దూది కాంతారావు, మాతా ప్రభు మండలం విద్యాశాఖ అధికారి టీ కుశలవ దొర, ఎం సుజాత, యుటిఎఫ్ ప్రెసిడెంట్ టీ.వి భగవాన్, యుటిఎఫ్ జిఎస్ జీవి శివ బాబు, పిఆర్ టు యు ఎం శివన్నారాయణ, పి ఆర్ టి యు జిఎస్ ఎస్ రాజు,తదితరులు పాల్గొని జిల్లా మరియు మండల ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలు బొడ్డేటి వెంకట్రావు, బి సాంబశివరావు, కే పూర్ణచందర్ రెడ్డి, బిఎస్ఏ లక్ష్మి, ఎస్ వి శ్రీనివాస్ ,పి పాపారావు, ఏ గణ మాంబ, ఎం చంద్రిక ప్రసన్న, ఎం రమాదేవి, కే శశికర్, ఎన్ వెంకట్రెడ్డి, ఎస్ చిన్నబాబు, పి మోహన్ రావు, జి ఎన్ పి రవి, ఏ ప్రసాద్ పాల్గొన్నారు.

శ్రీ భారతి విద్యానికేతన్ విద్యార్థినికి స్టేట్ ఓపెన్ కరాటే ఛాంపియన్ షిప్ పోటీల్లో ప్రథమ స్థానం

విశాలాంధ్ర - ప్రత్తిపాడు : డాక్టర్ బిఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో బిఆర్కే రాజు కన్వెన్షన్ సెంటర్లో ఆది వారం నిర్వహించిన ఇంటర్ స్టేట్ ఓపెన్ కరాటే ఛాంపియన్ షిప్ పోటీల్లో కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం ఒమ్మంగి శ్రీ భారతి విద్యా నికేతన్ విద్యార్థులు ప్రతిభ చాటి ప్రతిభ అవార్డులు, సర్టిఫికెట్లు అందుకు న్నారు. ఈ పోటీల్లో ప్రథమ స్థానం సాధించిన విద్యార్థిని వి పావని అలాగే విద్యార్థులు ఎస్ సూర్య, ఎస్ కార్తీక్, బి చైతన్యలు ద్వితీయ స్థానంలో నిలి చినట్లు శ్రీ భారతి విద్యా నికేతన్ కరాటే మాస్టర్ పి బుజ్జి తెలియజేశారు. ఈ కరాటే పోటీల్లో ప్రథమ, ద్వితీయ స్థానంలో అవార్డులు గెలుచుకున్న విద్యార్థులను శ్రీ భారతి విద్యాసంస్థల అధినేత సుంకర వీరబాబు, ఉపాధ్యాయులు అభినందించారు.

స్వచ్ఛమైన తాగునీరు అందించాలి : ఐద్వా డిమాండ్

విశాలాంధ్ర - కాకినాడ రూరల్ : అఖిల భారత ప్రజా తంత్ర మహిళా సంఘం ఐద్వ ఆధ్వర్యంలో తూరంగి పంచాయతీ డ్రైవర్స్ కాలనీ నాలుగు ఐదు సచివాలయంలో వద్ద ఖాళీ బిందులు మురికి కొళాయి నీరు సీసాలతో నిరసన తెలియజేశారు. సందర్భంగా ఐద్వా జిల్లా అధ్యక్షులు జి భూలక్ష్మి మాట్లాడుతూ రెండు రోజులకు ఒకసారి కుటుంబానికి రెండు బిందెలు మాత్రమే ఇస్తూ మురికి నీరు ప్రజలు మురికి నీరు తాగితే డయేరియా లాంటివి వాటి బారిన పడతారని మండిపడ్డారు. డ్రైవర్స్ కాలనీలో ఏళ్ల తరబడి నీటి సమస్య పరిష్కారం చేయడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయి అన్నారు. ఈరోజుకి ప్రజలు తాగునీరు కోసం రోడ్ ఎక్కాల్సిన పరిస్థితి ఉందంటే బాధాకరమన్నారు. తక్షణమే అధికారులు స్పందించి సమస్య పరిష్కారం చేయాలని లేదంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం సచివాలయం సిబ్బందికి ఈత పత్రం అందజేయగా సిబ్బంది సానుకూలంగా స్పందించారు. ఈ రోజే తాగునీరు ట్యాంకర్లు పంపిస్తామని నాలుగు ఐదు రోజుల లోపు సమస్య పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఐద్వా స్థానిక కమిటీ నాయకత్వం పట్టువర్త పద్మావతి, వీరమణి, లలితా భవాని, దుర్గ భవాని, ఉమామహేశ్వరి, స్థానిక నాయకులు తట్టవర్తి సుబ్బారావు పాల్గొన్నారు.

ప్రత్యేక వైద్య శిబిరాలు సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర - ఏలూరు: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా కుటుంబ సంక్షేమ శాఖ ద్వారా సెప్టెంబరు 17వ తేదీ నుండి అక్టోబరు 02వ తేదీ వరకు రెండు వారాల పాటు స్వస్త్ నారి సశక్త్ అభియాన్(ఆరోగ్య వంతమైన మహిళ- శక్తి వంతమైన కుటుంబం) అను సమగ్ర ఆరోగ్య ప్రచార్ మరియు సేవా కార్యక్రమము నిర్వహించ వలసినదిగా ఆదేశాలు జారీ చేయడం జరిగిందని జిల్లా వైద్యఆరోగ్య శాఖా అధికారి డా.పి.జె. అమృతం సోమవారం తెలిపారు.ఈ కార్యక్రమం ద్వారా మహిళలు ఆరోగ్యాన్ని కాపాడి కుటుంబం బలపరిచే లక్ష్యంతో ప్రణాళికలు సిద్ధం చేయడ మైనదని, కార్యక్రమం ముఖ్య ఉద్దేశాలు మహిళలు ఆరోగ్య పై అవగాహన పెంచడం జరుగుతుందన్నారు. మహిళలకు సమయానుకూల వైద్య సేవలు అందించడం, పోషకహారాన్ని ప్రోత్సహించడం, కుటుంబాలను స్వశక్తి చేయడం ఈ కార్యక్రమం యొక్క లాభాలు వివరిస్తామని తెలిపారు. మహిళలు ఆరోగ్యం బలపడితే కుటుంబం మొత్తం సంతోషంగా ఉంటుందని,తల్లి ఆరోగ్యంగా ఉంటే తన పిల్లలు ఆరోగ్యంగా పెరుగుతారని మహిళా శక్తి సమాజ శక్తికి పునాది అవుతుందని అన్నారు.ఈ కార్యక్రమం నినాదాలు తల్లి ఆరోగ్యం పిల్లలకు బలమైన భవిష్యత్, స్త్రీ శక్తి కుటుంబానికి సంతోషం అన్నారు. ఆరోగ్య అవగాహన- సమాజాభివృద్ధి ఆరోగ్య వంతమైన మహిళ శక్తివంతమైన కుటుంబానికి ఆధారం అన్నారు. ఆరోగ్య వంతమైన స్త్రీ అభివృద్ధి చెందిన సమాజానికి ఆధారం అన్నారు. కార్యక్రమానికి సంబంధించి జిల్లాలోని అన్ని గ్రామీణ పట్టణ ఆరోగ్య కేంద్రాలు,ఆరోగ్య ఉప కేంద్రాలు, ఏరియా హాస్పిటల్స్,సామాజిక ఆరోగ్య కేంద్రాలలో ఈ నెల 17 నుండి అక్టోబరు 02 వరకు ప్రత్యేక వైద్య శిబిరాలు వైద్య నిపుణులు,పారా మెడికల్ సిబ్బంది ద్వారా నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమం నిర్వహణ జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి, జిల్లా ఆసుపత్రుల కో ఆర్డి నేటర్ ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి సమన్వయంతో నిర్వహించాలని రాష్ట్ర వైద్యఆరోగ్య శాఖ కమీషనరు ఆదేశాలిచ్చారు. ఈ వైద్య శిబిరాలు నిర్వహణ సంబంధిత ఆరోగ్య కేంద్ర/ ఆసుపత్రి వైద్యాధికారులు నేత్రత్వంలో నిర్వహించబడుతుంది.

అంతే కాకుండా జిల్లా మండల,గ్రామ స్థాయిలో వైద్య శాఖ,మహిళా శిశు సంక్షేమ శాఖ,పంచాయత్ రాజ్ శాఖ మునిసిపల్ శాఖ, డిఆర్డిఏ మొదలగు శాఖల సమన్వయంతో ఈ బృహత్తర కార్యక్రమం నిర్వహించ బడుతుందని తెలిపారు.ప్రత్యేక అవగాహనా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని కావున జిల్లా వ్యాప్తంగా జరిగే ఈ వైద్య శిబిరాలను ప్రజలందరూ ఉపయోగించుకోవలసినదిగా ఏలూరు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా.పి.జె. అమృతం తెలిపారు.

ట్రైనింగ్ సర్టిఫికెట్లు అందజేత

విశాలాంధ్ర - యానాం : యానాం, గ్లోబల్ కొలాబరేషన్ ఇనిషియేటివ్స్ సేవా సంస్థ ద్వారా ఉమెన్ స్కిల్ డెవలప్మెంట్ ట్రైనింగ్ ఏర్పాటు చేయడం జరిగింది. స్థానిక బీమ్ నగర్ కోనా గార్డెన్‌లో గల మొదటి వీధిలో సుమారు 20 మంది మహిళలకు ఉచితంగా బ్యూటీ పార్లర్ ట్రైనింగ్ అందించడం జరిగింది. ఈ కార్యక్రమానికి యానాం మాజీ మున్సిపల్ చైర్మన్ పెండేం సూర్య ప్రకాష్, ప్రముఖ పాత్రికేయులు లంక బంగారం, వ్యాపార వేత్త రాయవరపు శ్రీనివాస్‌లు ముఖ్య ఆతిధులుగా పాల్గొని సర్టిఫికెట్లు అందచేశారు. అదేవిధంగా సంస్థ అధినేత కరగాని ప్రవీణ్ మాట్లాడుతూ ఇటువంటి కోర్సులు ద్వారా శిక్షణలు పొందితే వాటి ద్వారా కుటుంబం అన్ని విధాలుగా ఆర్థికంగా బలపడాలనే ఉద్దేశంతో ఈ స్కిల్ డెవలప్మెంట్ ట్రైనింగ్ ఇవ్వడం జరిగింది అన్నారు. రానున్న రోజుల్లో ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో పలు చోట్ల ఇటువంటి ట్రైనింగ్స్ ఏర్పాటు చేసే పనిలో ఉన్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బ్యూటీ కోర్సు ట్రైనర్ పొందిన మహిళలు పాల్గొన్నారు.

చిన్నారులకు ఫైలేరియా టెస్టులు

విశాలాంధ్ర - గోకవరం : మండలంలో గోకవరం -3 సచివాలయంలో రాన సెం టర్‌లోని ప్రాధమిక పాఠశాలలో "లింఫాటిక్ ఫైలేరి యాసిస్ నిర్మూలనలో భాగంగా విద్యార్థులకు వైద్యపరీక్షలు జి. కొత్తపల్లి పి.హెచ్.సి వైద్యాధికారి డా. నిఖిత ఆధ్వ ర్యంలో 10మందికి ఫైలే రియా టెస్టులు చేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు దివ్యనాగశ్రీ, వైద్య సిబ్బంది ఎమ్.ఎల్. హెచ్.పి లు అరుణ, రమ్య, మోనిక, అనూష ఏ.ఎన్. ఎమ్ లు అమ్మాయి, నాగరత్నం, హెల్త్ అసిస్టెంట్ రమణ, శ్రీనివాస్, ఆశాలు కుమారి, శ్రీదేవి,దేవి పాల్గొన్నారు.

తెగిన గాలిపటంలా కార్పొరేషన్ పాలన

విశాలాంధ్ర - కాకినాడ : కాకినాడ నగరపాలక సంస్థ పాలకవర్గ పదవీకాలం ముగిసి నేటికి మూడేళ్లు అయ్యిందని గత ప్రస్తుత ప్రభుత్వాల్లో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరగవలసిన స్పెషల్ ఆఫీసర్ నిర్వహణలో అఖిల పక్షం చేపట్టక పోవడం వలన తెగిన గాలిపటం చందంగా కార్పొరేషన్ పాలన పూర్తిగా పక్షవాతం దశకు వచ్చిందని కాకినాడ కార్పొరేషన్ పూర్వ పాలక మండలి సభ్యులు దూసర్లపూడి రమణ రాజు పేర్కొన్నారు. కమిషనర్, సిటీ రూరల్ ఎమ్మెల్యేలు, ఎంపీ, రాజ్యసభ సభ్యుడు, శాసనమండలి సభ్యుల మధ్య సమన్వయం లేకపోవడం వలన కార్పొరేషన్ పాలన పూర్తిగా అనారోగ్యానికి చేరిందన్నారు. డిప్యూటీ ముఖ్య మంత్రి జిల్లాలో మున్సిపల్ మంత్రి జిల్లా ఇంచార్జ్ ఉన్నప్పటికీ శానిటేషన్, మురుగు పారుదల, వీధిదీపాల నిర్వహణ వంటి అంశాల్లో ఎటువంటి మెరుగైన ప్రయోజనం లేదన్నారు. పదేళ్ల స్మార్ట్ సిటీ ప్లాన్ పూర్తిగా అట్టర్ ప్లాప్ అయ్యిందన్నారు. విజిలెన్స్ ఏసీబీ తనిఖీలు కరువయ్యి. కార్పొరేషన్ నిధులు నాశనం చెందాయన్నారు. స్మార్ట్ సిటీ బకాయి రూ.182కోట్లు దశాబ్దకాలంగా రాష్ట్ర ప్రభుత్వం ఇతరశాఖల పనులకు వాడుకున్న రూ.200 కోట్ల నిధులు ప్రభుత్వ కార్యాలయాల ఆస్తి పన్ను బకాయి రూ.70 కోట్లు విడుదల చేయక పోవడం వలన ఆర్థిక సంఘం నిధులు మూడేళ్లుగా రూ.30 కోట్లు రాకపోవడం వలన నగరం అభివృద్ధి పూర్తిగా అడుగంటిం దన్నారు. ప్రస్తుతం డయేరియా అనారోగ్యాలు ప్రభలే దుస్థితిలో ఉందన్నారు. ముఖ్యమంత్రి సమాలోచన చేసి అఖిల పక్షం నిర్వహణ చేయించి అధికారులు చట్ట సభల ప్రతినిధుల నడుమ సమన్వయం ఏర్పరచి ప్రభుత్వ బకాయిలు విడుదల చేయించి సమగ్ర ప్రణాళికతో కాకినాడ జిల్లా కేంద్రాన్ని గ్రేటర్ దిశగా అభివృద్ధి చేయాలన్నారు. మురుగు పారుదలకు ప్రాధాన్యత ఇచ్చి ఆక్రమణల తొలగింపు వహించి సంపూర్ణ డ్రైనేజీ సౌకర్యాలు నూతన కల్వర్టుల నిర్మాణాలు అవుట్ లెట్ మార్గాలకు పునరుద్దరణ పనులు వహించాలన్నారు.

శెట్టిబలిజ కులం సర్టిఫికెట్లుపై హర్షం

విశాలాంధ్ర - కాట్రేనికోన : రాష్ట్రంలో వివాదాస్పదమైన శెట్టిబలిజ కులం సర్టిఫికెట్లు జారీ సమస్య పరిష్కారం అయింది. సోమవారం నుండి గ్రామ వార్డు సచివాలయాలు, మీ సేవా కేంద్రాల ద్వారా యధావిధిగా శెట్టిబలిజం కులం సర్టిఫికెట్లు ప్రత్యేకంగా జారీ అవుతున్నాయి. ఇందుకు సంబంధించిన సాఫ్ట్వేర్‌లో మార్పులు చేయడంతో శెట్టి బలిజ కులం ఆప్షన్‌తో పాటు మరో 5 గీత కులాలకు ప్రత్యేకంగా కులం సర్టిఫికెట్లు వస్తున్నాయి. ఈ ఏడాది ఆగస్టు ఏడో తేదీ నుండి గౌడ (శెట్టిబలిజ) కులంగా సర్టిఫికెట్లు రావడంతో ఆ సామాజిక వర్గాల నుండి తీవ్ర వ్యతిరేకత, అభ్యంతరాలు రావడంతో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకువెళ్లి ఎప్పటిలాగే కులం సర్టిఫికెట్లు ఇప్పించాలని కోరడంతో సీఎం స్పందించారు. తాత్కాలికంగా శెట్టిబలిజ కులం సర్టిఫికెట్లు జారీని నిలుపుదల చేస్తూ సీఎం ఆదేశాలు ఇచ్చారు. ఈ నేపథ్యంలో ఈనెల 11న పాత జీవోలో మార్పులు చేసి కొత్త జీవో ఎంఎస్ 6ను రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసింది. శెట్టిబలిజ కులస్తులకు శెట్టిబలిజ బీసీ బి సీరియల్ నెంబర్ 4గా కులం సర్టిఫికెట్లు జారీ చేయమని జీవోలో పేర్కొన్నారు. వెంటనే సాఫ్ట్వేర్ మార్పులు చేసి కులం సర్టిఫికెట్లు జారీ చేయాలని డైరెక్టర్, బీసీ వెల్ఫేర్, సిసిఎల్ఏ, విజయవాడ వారిని ప్రభుత్వం ఆదేశించింది. సీఎం ఆదేశం మేరకు ఎప్పటిలాగే శెట్టి బలిజ కులం సర్టిఫికెట్లు జారీ అయ్యేలా ప్రభుత్వ నుండి గురువారం మే ఉత్తర్వులు వెలువడ్డాయి. శెట్టిబలిజ కులంతో పాటు గౌడ్, ఈడిగ, కలేలి, గౌండ్రా, శ్రీశైన కులాలకు కూడా ఎప్పటిలాగే ప్రత్యేకంగా ఆయా కులం సర్టిఫికెట్లు జారీ చేయాలని ఆ జీవోలో పేర్కొన్నారు. గత నెల రోజులకు పైగా శెట్టిబలిజ తదితర గీత కులాలకు కులం సర్టిఫికెట్లు నిలిచిపోవడంతో ఆ సామాజిక వర్గాలకు చెందిన విద్యార్థులు, నిరుద్యోగులు, మహిళలు, ఇతరులు అనేక ఇక్కట్లు ఎదుర్కొన్నారు. ఎట్టకేలకు జీవోలో మార్పులు పుణ్యమా అని 15వ తేదీ సోమవారం నుండి యధావిధిగా కులం సర్టిఫికెట్ జారీ అవుతుండడంతో ఆ వర్గాలు వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గౌడ తొలగించి శెట్టి బలిజ కులం సర్టిఫికెట్లు ఇప్పించేందుకు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి కృషి చేసిన మంత్రి సుభాష్‌కు, జీవోలో మార్పులకు చొరవ చూపిన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి అసామాజిక వర్గం, నాయకులు కృతజ్ఞతలు తెలుపుతున్నారు. సీఎం చంద్రబాబు చిత్రపటాలకు పాలాభిషేకం చేసి కృతజ్ఞతాభిమానాన్ని చాటుకుంటున్నారు.